J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 20




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 41 సంచిక : 04 2.7.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఇంటి పోరుగా మారుతున్న నీటి పోరు



**రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదం ఇప్పుడు వై.యస్ కుటుంబ ఇంటి పోరుగా మారి అన్నాచెల్లెళ్ళ మధ్య చిచ్చుపెట్టేలా ఉంది**

***రెండు తెలుగు రాష్ట్రాల నీటి వివాదం ఇప్పుడు వైయస్ కుటుంబ ఇంటి పోరుగా మారేలా ఉంది. నీళ్ళ గొడవ అంటే ఏ కొళాయి దగ్గరో లేకపోతే వాటర్ ట్యాంకర్ దగ్గరో జరుగుతుంటుంది ఇది సహజం. కానీ ఇప్పుడు ఇదే నీళ్ళ తగాదా రెండు రాష్ట్రాల మధ్య మొదలయ్యింది.***

అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు ఆస్తుల కోసం తగాదా పెట్టుకుంటారు. కానీ ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో అన్నా చెల్లెళ్ళు నీళ్ళ కోసం కొట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది. కృష్ణ, గోదావరి నదులకు ఎగువ రాష్ట్రం తెలంగాణ.. దిగువ రాష్ట్రం ఆంధ్ర.. అయినా ఆంధ్రపై తెలంగాణ పంచాయతీ పెట్టింది..!

మొగుణ్ణి కొట్టి మొగసాలకు ఎక్కిందటో ఇల్లాలు, అదే తీరులో తెలంగాణ ప్రభుత్వ వైఖరి ఉన్నట్టు ఇక్కడ కనపడుతోంది.

కృష్ణా నది గానీ, గోదావరి నది గానీ ముందు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించి, తెలంగాణ అవసరాలు తీర్చిన తరువాతే ఆంధ్రలోకి ప్రవేశిస్తాయి. ఇక, ఆంధ్రప్రదేశ్‌కు దిగువ రాష్ట్రం అంటూ ఏమీ లేదు. రెండు నదులూ ఆంధ్రనుంచి నేరుగా సముద్రంలోకే ప్రయాణం. అయితే, ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు, తెలంగాణ ప్రయోజనాలను విస్మరించి నీటిని ఆంధ్రకు ఆంధ్ర పాలకులు తరలించుకుపోతున్నారంటూ తెలంగాణ నాయకులు ప్రజలలో

3 లో

**నీతి మాలిన నేతలు, దిక్కు మాలిన వ్యవస్థలు**

# డామేజ్ అవుతున్న టీనేజ్



**సమాజంలో అత్యంత కీలకమైన అంశాలు విద్య, వైద్యం. కరోనా పుణ్యమా అంటూ వైద్యం అత్యంత ఖరీదైపోయి సామాన్యుడిని వణికిస్తోంది. రాజకీయ నేతల స్వార్ధంతో విద్యా రంగం అధోగతి చెంది అవస్థల పాలవుతోంది.**

విద్యార్థులకు నాణ్యమైన చదువులు లేవు. చదువుకున్న వారికి పరీక్షలు లేవు. పరీక్ష రాసిన వారి రిజల్ట్స్ రావు, వచ్చినా... వాటికి

2 లో

- ఎలక్షన్లు కావాలంటున్నారు... పరీక్షలు వద్దంటున్నారు
- ఆన్‌లైన్ తరగతులతో ట్రాక్ తప్పి రాంగ్‌లైన్‌లో వెళ్తున్న టీనేజర్స్
- అయోమయంలో విద్యార్థులు.. ఆందోళనలో తల్లిదండ్రులు
- ఇప్పుడు సంబరపడితే.. భవిష్యత్‌లో చతికిల పడతారు.



# డామేజ్ అవుతున్న టీనేజ్

(మొదటి పేజీ తరువాయి)




హేతుబద్ధత వుండదు. అయ్యవార్లకు జీతాలు లేవు, స్కూళ్ళు, కాలేజీలు, కోచింగ్ సెంటర్లకు పని లేదు. ఇదీ ప్రస్తుతం దేశంలో విద్యా వ్యవస్థ పరిస్థితి.

సహజంగా పిల్లలు 12 సంవత్సరాలు దాటి 13లో అడుగు పెట్టినప్పటినుండి వారిని టీనేజర్స్ అంటారు. టీనేజ్‌లో ప్రవేశించినప్పటి నుండే వారిలో మార్పులు క్రమేపీ సంభవిస్తుంటాయి. సాధారణంగా పిల్లలకు పదమూడేళ్లంటే ఆ వయసులో వాళ్ళు 8వ తరగతిలో ఉంటారు. 13లో ప్రవేశించి 19 పూర్తయ్యే నాటికి అంటే టీనేజ్ సమాప్తమై, నైంటీన్ నుండి ట్వంటీలోకి వెళ్ళేటప్పటికే వాళ్ళలో ఆలోచనా శక్తి బలపడుతుంది. హావభావాలలో మార్పులొస్తాయి, శరీరంలో మార్పులు సంభవిస్తాయి, ఆహార్యం కొత్త రూపుదాలుస్తుంది. మొత్తానికి టీనేజ్‌లో ప్రవేశించి బయటకు వచ్చేసరికి పరిపక్వత చెందిన వ్యక్తులుగా తయారవుతారు. అలాంటి టీనేజర్స్ ఇప్పుడు ప్రమాదంలో ఉన్నారు. వారి భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారింది. కోవిడ్ పుణ్యమా అంటూ జరుగుతున్న ఆన్‌లైన్ తరగతులు వారిని ట్రాక్ మళ్ళించి పక్క లైన్లోకి తీసుకెళ్తున్నాయి.

అయ్యవార్ల పర్యవేక్షణలో చదువుకోవడం, పదిమందితో కలవడం, పాఠ్యాంశాలపై చర్చించుకోవడం, సాయంత్రమైతే కలిసి ఆడుకోవడంతో పాటు ఒకే బస్సులో కలిసి ఇళ్ళకు చేరుకోవడం. ఇవన్నీ చదువుకునే తొలిరోజులనుండే అలవాటు పడతారు పిల్లలు. గత ఏడాది కాలంగా స్కూళ్ళు లేవు, కాలేజీలూ లేవు. కరోనా పుణ్యమా అంటూ ఒకరినొకరు కలుసుకోవడమూ కరువైపోయింది. ఈ పరిస్థితులన్నీ రేపటిపౌరులపై దుష్ప్రభావం చూపుతున్నాయి.

## ప్రశ్నార్ధకంగా మారిన పిల్లల భవిష్యత్తు




ఆన్‌లైన్ క్లాసులలో ఉన్న పిల్లలను అస్తమానం కనిపెట్టి ఉండడం అమ్మానాన్నలకు కష్టతరం కావడంతో ఇళ్ళల్లో వాళ్ళది ఇష్టారాజ్యమైపోతుంది. ఇలాంటి వాతావరణంలో పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిపోతోంది. అవకాశానికి తగ్గట్లుగా విజృంభించే అసాంఘిక శక్తులకు, అక్రమ సంపాదనకు కక్కుర్తిపడే సంఘ విద్రోహులకు ఈ ఆన్‌లైన్ క్లాసులు బాగా ఉపయోగపడుతున్నాయి. తరగతి పాఠాలు చదువుకుంటున్న పిల్లల డెస్క్‌టాప్‌లపై హఠాత్తుగా అసభ్యకర వెబ్‌సైట్ల ప్రకటనలు ప్రత్యక్షమవుతున్నాయి. ఈ ప్రకటనలు పిల్లల మెదడులను చెడ గొట్టడంతో పాటు వారి ఏకాగ్రతను పక్కదోవ పట్టిస్తున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో విద్యావ్యవస్థ అవస్థలుపడుతోంది.

## సందట్లో సడేమియాగా రాజకీయ పార్టీల జోక్యం..

జరిగీ జరగని క్లాసులతో, అర్ధం అయ్యి కాని చదువులతో తామోపక్క సతమతమవుతుంటే విద్యా వ్యవస్థలో రాజకీయపార్టీల నేతల జోక్యం అసహ్యం పుట్టిస్తోంది. లక్షలాది మంది పాల్గొంటున్న ఎన్నికలకు ఈ దగుల్బాజీ నేతలు రెడీ అంటున్నారు. సామాజిక దూరం పాటించడానికి అవకాశమే లేని వేలమందితో జరిగే రాజకీయ సభలకు వీళ్ళు జై కొడుతున్నారు. పోటీ ప్రపంచంలో, ఏడాదంతా కష్టపడి చదివి, మంచి మార్కులను సాధించి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలనుకుంటున్న వారి తలరాతలను ఈ నేతలు మార్చేస్తున్నారు. న్యాయ వ్యవస్థను అడ్డం పెట్టుకుని పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు. విద్యార్థులకు పరీక్షలు జరగడం ప్రధానం. మంచి మార్కులతో పాస్ కావడం వారికి అవసరం. ప్రతి దశలోనూ మంచి తెలివి కలిగిన మెరిట్ స్టూడెంట్లతో పాటు యావరేజ్ విద్యార్థులు కూడా ఉంటారు. ఇలాంటి సందర్భాలలో పరీక్షలే వీరి సామర్థ్యాన్ని సమర్ధతని నిర్ణయిస్తాయి. ఆ పరీక్షలు వద్దంటూ రాజకీయపార్టీలు కోర్టును ఆశ్రయించి స్టేలు తెచ్చాయి. పరీక్షా సమయంలో సామాజిక దూరం పాటించడానికి అవకాశం వుంది. కోవిడ్ నిబంధనల ప్రకారం అన్ని ముందుజాగ్రత్తలు తీసుకుని ఎగ్జామ్స్ పెట్టుకోవడానికి మన దగ్గర అన్ని వనరులు ఉన్నాయి. కానీ పరీక్షలు వాయిదా వేయించారు. అందరిని పాస్ చేయించి గాడిదని గుర్రాన్ని ఒకే గాటికి కట్టేశారు. తమ స్వార్ధ ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలతో రాజకీయ నాయకులు ఆడుకుంటున్నారు. అది తమ రాజకీయ విజయంగా చంకలు గుద్దుకుంటున్నారు.

## రానున్న రోజుల్లో మరిన్ని ఇబ్బందులు

ఇప్పుడు పాసయ్యి పోయామనుకుని సంబరపడుతున్న ఎంతో మంది భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. ముందు రోజుల్లో తమ తమ మేధస్సుకు పరీక్ష పెట్టే తరహాలో జాతీయ స్థాయిలో జరిగే అనేక ప్రవేశ పరీక్షలలో వీరంతా చేదు అనుభవాలను చవిచూడాల్సి వస్తుంది. ఇప్పుడు సంతోషపడినా రాబోయేకాలంలో బాధపడక తప్పదు.

మనతో పాటు ప్రపంచదేశాలలో కూడా అనేక ప్రాంతాలను ఈ కరోనా గడగడ లాడించింది. వారంతా పకడ్బందీ చర్యలు తీసుకుని ఈ మహమ్మారిని కట్టడి చేశారు. కరోనా పుట్టినిల్లు చైనాలో సైతం విద్యా సంస్థలు తెరుచుకున్నాయి. అత్యంత కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుని విద్యాలయాలను పునఃప్రారంభించారు. విద్యా సంస్థలు తెరుచుకోకపోతే రానున్న రోజులలో సమాజం ఎదుర్కొనబోయే సమస్యలను వాళ్ళు ముందుగానే వూహించారు. మనదేశంలో మాత్రం విద్యను అపహాస్యం చేస్తున్నారు. ముఖ్యంగా మన రాష్ట్రంలో చదువుకి రాజకీయ రంగు పులిమి భ్రష్టు పట్టిస్తున్నారు.

## చైతన్యం రావాలి

ఈ పరిస్థితుల్లోనైనా తల్లిదండ్రులలో చైతన్యం రావాలి. రాజకీయ స్వార్ధ ప్రయోజనాల కోసం నేతలు చేస్తున్న కుహనా రాజకీయాల నుండి విద్యా రంగాన్ని వాళ్ళే కాపాడుకోవాలి. ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తే ఆ ప్రభావం వారి బిడ్డలపై పడుతుందన్న వాస్తవాన్ని గ్రహించాలి. ఏ వ్యవస్థల్ని అడ్డుపెట్టుకుని పార్టీలు తమ పబ్బం గడుపుకుంటున్నాయో అదే వ్యవస్థల ద్వారా వారి ప్రయత్నాలను తిప్పికొట్టాలి. తమ బిడ్డలు లక్షణంగా స్కూళ్లకు వెళ్ళి క్రమశిక్షణతో కూడిన చదువు అభ్యసించడంతో పాటు, తోటి విద్యార్థులతో కలసి చైతన్యవంతులయ్యేలా ప్రయత్నాలు మొదలు పెట్టాలి. అప్పుడే విద్యా వ్యవస్థకు న్యాయం జరగడంతో పాటు భావి భారతపౌరులకు మేలు కలుగుతుంది.



# ఇంటి పోరు

(మొదటి పేజీ తరువాయి)



సెంటిమెంట్‌ను రెచ్చగొట్టారు. వర్క్ ఔట్ అయింది, రాష్ట్రం విడిపోయింది. ఆ తరువాత తెలంగాణ ప్రాంతం ఆంధ్రకు ఎగువ రాష్ట్రం అయి కూర్చుంది.

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు గోదావరికి మహారాష్ట్ర ఎగువ రాష్ట్రం అయితే, కృష్ణాకు కర్ణాటక ఎగువరాష్ట్రం అయింది. ఇప్పుడు రెండు నదులకూ తెలంగాణ రాష్ట్రమే ఎగువ రాష్ట్రం. కానీ, ఆంధ్ర ప్రభుత్వం తెలంగాణ నీళ్లు దొంగిలించుకుపోతుందని తెలంగాణ ఇల్లెక్కి కూస్తోంది. సముద్రంలోకి వెళ్లే నీళ్లను ఆంధ్ర వాడుకుంటోంది. ఇది సింపుల్ లాజిక్కు. అయినా రెండు రాష్ట్రాల మంత్రులో..., అధికారులో కలిసి కూర్చుంటే పరిష్కరమయ్యే వివాదం ఇది.

అయితే, హుజూరాబాద్‌లో ఉపఎన్నిక ఉంది. మరోపక్క, రేవంత్‌రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. అందువల్ల, మళ్లీ భావోద్వేగాల అవసరం టీఆర్ఎస్ పార్టీకి ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్ర ప్రజల సౌలభ్యం కోసం జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టులను చేపట్టి, అభినవ కాటన్ దొరగా పిలిపించుకున్న రాజశేఖరరెడ్డి తెలంగాణ నాయకులకు ఇప్పుడు అర్జంట్‌గా నరరూపరాక్షసుడై పోయారు. జగన్మోహనరెడ్డి గజదొంగ అయిపోయారు. పులిచింతల ప్రాజెక్ట్ తెలంగాణ ప్రాంతంలో కట్టినప్పటికీ ఆంధ్రలోని కృష్ణా డెల్టా స్థిరీకరణకు ఉద్దేశించింది. తమ ప్రాంతంలో ఉంది కాబట్టి, ఆ నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం అంటూ తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి మొదలు పెట్టింది.

పులిచింతలకు సంబంధించి ఇప్పటివరకు వివాదం లేదు. తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రతో నీటి పంచాయతీ పెట్టుకుందనే భావం తెలంగాణ ప్రజలలో వ్యాపించాలనేది అసలు వ్యూహం. అందుకే కృష్ణా రివర్ మానిటరింగ్ బోర్డ్ ఆదేశాలను సైతం తెలంగాణ పట్టించుకోవడం లేదు.

ఇది ఇలాఉంటే, ఈ రొచ్చులో వై.ఎస్. కుమార్తె షర్మిల అడుగుపెట్టారు. తెలంగాణ నీరు ఒక్క చుక్క బొట్టును కూడా వదులుకునేది లేదంటూ ఒక ప్రకటన చేశారు. ఆంధ్రాకు చెందిన రాయలసీమ వాసులు హైదరాబాదులోని ఆమె నివాసం, లోటస్ పాండ్ దగ్గర ఆందోళనకు దిగారు. షర్మిల అనుచరుడు ఒకరు ఆంధ్ర నేతను బూటు కాలితో తన్నినట్టు వార్తలు వచ్చాయి.

తెలంగాణ నేతలు కోరుకుంటుంది కూడా ఇదే. తోడబుట్టిన వారిమధ్య విభేదాలకు బీజం పడింది. ఈ భావోద్వేగాల రచ్చ... ఎంతదూరం వెడుతుందోనని డాక్టర్ వై.ఎస్. అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జులై 8వతేదీ రాజశేఖర రెడ్డి 72వ జయంతి జరగనున్న తరుణంలో, ఇలాంటి పరిస్థితి రావడం వై.యస్ కుటుంబ అభిమానులు జీర్ణించుకోలేకున్నారు. వై.యస్ షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం వెనుక కుటుంబ నేపథ్యమే వుంటే అది ఇప్పుడు బెడిసి కొడుతోంది. ఒకవేళ అలా కాకుండా షర్మిల వెనుక వేరెవరైనా ఉండి, కారణాలు ఇంకేమైనా అయివుంటే నీటి పోరు కాస్త ఇప్పుడు అతి పెద్ద ఇంటిపోరుగా మారిపోయే అవకాశాలు లేకపోలేదు. ఏదిఏమైనా రాజశేఖరరెడ్డి ఆత్మను క్షోభపెట్టే ఇలాంటి సంఘటనలు ఎవరికీ శ్రేయస్కరం కాదు...!

# బిఎంఆర్ ట్రస్ట్ సేవలు

## ఆసుపత్రికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు

కరోనా బాధితులను మానవతా హృదయంతో ఆదుకుంటూ బిఎంఆర్ ట్రస్ట్ గతనెల 29న నెల్లూరులోని రామచంద్రారెడ్డి ఆసుపత్రికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందజేసింది. డాక్టర్ జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిఎంఆర్ ట్రస్ట్ ప్రతినిధి అనిల్ ఆ పరికరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు అందజేశారు. రాజగోపాల్, సిపిఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎంవి రమణయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.





• లాయర్ వార్తకు స్పందన

## పైపు పగిలింది.. నీళ్ళు కారాయి

# రోడ్డు పగిలింది.. నీళ్ళు ఆగాయి




'లాయర్' జూన్ 18వతేదీ సంచికలో "లక్షల లీటర్ల మంచి నీళ్ళు – నెలల తరబడి నేల పాలు" శీర్షికతో మాగుంట లే అవుట్ లోని రెండవ మెయిన్ రోడ్డులో నెలల తరబడి నీళ్లు నేలపాలవుతున్నాయంటూ వార్త ప్రచురితమయ్యింది. ఈ వార్తపై కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించారు. నీళ్ళు ఆగాలంటే రోడ్డు పగలాలి అని తీర్మానించారు. వెంటనే రోడ్డుబ్రేకర్ యంత్రాన్ని రప్పించి రోడ్డుని అడ్డంగా పగులగొట్టేశారు. మొత్తానికి నీళ్ళను కారకుండా చేసేశారు. ఇప్పుడు ఆ రోడ్డు వాసులకు కొత్త కష్టాలు మొదలయ్యాయి, పగులగొట్టిన రోడ్డును మళ్ళీ కాంక్రీటు చెయ్యకుండా మట్టితో పూడ్చి వదిలేశారు. అయ్యో బంగారంటి రోడ్డు పాడైపోయిందే అని ఆ ప్రాంతవాసులు బాధపడుతున్నారు. రోడ్డు తవ్వడానికి వచ్చినరోజే యధావిధిగా పూడ్చి కాంక్రీటు వేసేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతానికి మట్టితో పూడ్చి మమ అనిపించారు. మళ్ళీ ఎన్ని రోజులు ఎదురు చూడాలో... ఎంతమంది నడుములు విరగాలో అర్థం కాక అయోమయంలో ఉన్నారు అక్కడి వాసులు. కమిషనరు గారు వెంటనే స్పందించి పగులగొట్టిన రోడ్డు ప్రాంతంలో కాంక్రీటు వేయించాలని వాళ్ళు కోరుతున్నారు.

# 'ప్రభా'తం

కంటికి కనిపించని సూక్ష్మ రాకాసి కరోనా మాయలమారి కొత్తఎత్తులతో మానవాళిని మింగడానికి చూస్తోంది. రకరకాలుగా రూపం మార్చుకొని కొత్త వేరియంట్‌లతో విజృంభిస్తోంది. ఈ కరోనా వైరస్ వేరియంట్లను చూసి ప్రపంచమే బెంబేలెత్తిపోతోంది. ఇప్పటికే కరోనా మొదటిదశ చూశాం. మొదట్లో దాని ఉధృతికి భయపడి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాం. రెండోదశ వచ్చాక అది ఇక మనలను ఏమీ చేయలేదులే అని తాత్సారం చేశాం. అదే చావుదెబ్బ కొట్టింది. గత మూడు నెలల్లో కరోనా భయంకర రాక్షసరూపం దాల్చి ఎంతోమందిని బలి తీసుకుంది. దాని మారణహోమం నేటికీ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ దాని ప్రతాపం తగ్గడం లేదు. తగ్గినట్లే తగ్గి మళ్ళీ వేరే రూపాల్లో వచ్చి జనానికి ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. ఒకవేళ కోవిడ్ వైరస్‌ను తట్టుకుని బతికినా, ఫంగస్ వ్యాధులు వచ్చి పైనపడుతున్నాయి. కరోనా సోకి తగ్గిపోయిందిలే అనుకున్నవాళ్ళు కూడా అనేకమంది ఈ వ్యాధులతో మృత్యువాతపడ్డారు. తాజాగా ప్రపంచాన్ని హడలెత్తిస్తున్న డెల్టా వేరియంట్, దాంతోపాటు డెల్టా ప్లస్ వేరియంట్, ఇంకా మరిన్ని వేరియంట్‌లు రానున్న రోజుల్లో ఇంకెంత కల్లోలం చేస్తాయో చెప్పలేం. ఈ రెండు వేరియంట్లు కూడా ఇప్పటికే అనేకదేశాల్లో ప్రత్యక్షమయ్యాయి. మనదేశంలోని పలు రాష్ట్రాల్లో కూడా బయటపడ్డాయి. ఈ కరోనా వైరస్ వేరియంట్ల కొనసాగింపు ఇలాగే కొనసాగితే, డెల్టా వేరియంట్‌తో ప్రపంచానికి ముప్పు తప్పదని ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ఇటీవలే హెచ్చరించింది. వేగంగా వ్యాప్తి చెందుతూ, వ్యాధి తీవ్రతను పెంచే గుణం ఉన్న నాలుగు కరోనా వేరియంట్లను డబ్ల్యుహెచ్ఓ 'ఆందోళనకరమైన వేరియంట్లు'గా స్పష్టం చేసింది. వాటికి ఆల్ఫా, బీటా, గామా, డెల్టా వేరియంట్లుగా పేరుపెట్టింది. అత్యంత ప్రమాదకరమైన డెల్టా వేరియంట్‌ని ప్రపంచవ్యాప్తంగా 85 దేశాల్లో గుర్తించారు. మన దేశంలో మహారాష్ట్ర, కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో డెల్టా ప్లస్‌ను గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో కూడా ఇటీవల డెల్టా ప్లస్ కేసులు బయటపడ్డాయి. కరోనా వైరస్ రకాల్లో డెల్టా ప్లస్ ఇంకా ప్రమాదకరమని, దాన్ని తేలిగ్గా తీసుకోవడానికి లేదని నిపుణులు చెప్తున్నారు. ఇది ఊపిరితిత్తుల కణజాలంతో ఎక్కువగా పెనవేసుకుంటుందని, అయితే ఇది ఎంత తీవ్రమైనదో ఇంకా స్పష్టత లేదని మరికొందరు శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇప్పటికే ప్రపంచ దేశాలను కరోనా అల్లకల్లోలం చేస్తోంది. జూన్ నెలాఖరునాటికి ప్రపంచవ్యాప్తంగా కరోనా రాకాసి వ్యాధి సోకిన వారి సంఖ్య 18 కోట్ల 23 లక్షలకు పైగానే పెరిగిపోవడమే కాక, 39 లక్షల 47 వేలమందికి పైగానే ఈ వ్యాధికి బలైపోయారు. రేపోమాపో ఈ సంఖ్య 40లక్షలు దాటేస్తుందన్నా ఆశ్చర్యం లేదు. మన దేశంలోనూ కరోనా ఇంకా మృత్యుఘంటికలు మోగిస్తూనే ఉంది. దాదాపు 3 కోట్ల 3 లక్షల మందికి పైగానే కరోనా సోకి నానా యాతనలు పడుతున్నారు. నేటికీ వేలాది కేసులు ప్రతిరోజూ వస్తూనే ఉన్నాయి. దాదాపు నాలుగు లక్షలమందికి పైగానే జనం ఈ వ్యాధితో మరణించారంటే కరోనా ఎంతగా విజృంభిస్తోందో అర్థమవుతుంది. రెండోదశ కరోనాలో మనదేశంలో లక్షలాదిమంది దీని బారినపడ్డారు. వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. చివరికి ఎలాగో వ్యాక్సిన్ రావడం, మందులు అందుబాటులోకి రావడం, వైద్య చికిత్సలు మెరుగవడం, మునుపటి కంటే ప్రజలకి కరోనా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలగడం వగైరాలతో రెండో దశ కల్లోలం నుంచి మనదేశం ఇప్పుడిప్పుడే బయటపడుతుందనుకుంటున్న తరుణంలో..అదిగో మళ్ళీ 'మూడో ముప్పు'గా థర్డ్‌వేవ్ పొంచి ఉందని, దీనివల్ల పిల్లలకు ముప్పు కలిగే ప్రమాదం ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అటు ఫంగస్ వ్యాధులు, ఇటు థర్డ్‌వేవ్.. ఎలా తట్టుకోవాలోనని తల పట్టుకుంటున్న సందర్భంలో ఇంకో వైపు నుంచి మళ్లీ డెల్టా ప్లస్ వంటి కరోనా వేరియంట్లు చుట్టుకోవచ్చని అంటున్నారు. ఇప్పటికే కరోనా-1, 2 దశల దెబ్బతో దేశం అతలాకుతలమైపోయింది. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైపోయింది. ఎంతోమంది నిరుపేదలు, కష్టజీవులతో పాటు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జీవనపరిస్థితులు కూడా అల్లకల్లోలమైపోయాయి. పనులు లేవు, పరిశ్రమలు లేవు, బడుల్లేవు, చదువుల్లేవు ఒకటేమిటి అన్ని రంగాలు కుదేలైపోయాయి. ఈ కరోనా పీడ ఎప్పుడు విరగడవుతుందో మరి! ఈ కష్టకాలంలో ప్రజల ప్రాణాలను, జీవనాలను కాపాడేందుకు ప్రభుత్వాలు మునుపటికంటే ఇంకా భారీస్థాయిలో నిధులు కేటాయించి ఆదుకోవాలి. ఇటీవలే కేంద్రమంత్రి 6.28 లక్షల కోట్ల ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించడం సంతోషకరమే అయినా కరోనా పెడుతున్న కష్టాల నుంచి ప్రజలను ఆదుకోవడానికి ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. ఏదేమైనా.. రానున్న థర్డ్‌వేవ్‌ను, డెల్టా ప్లస్ వంటి వేరియంట్ల ముప్పును ఎదుర్కోడానికి సర్వసన్నద్ధం కావడంతో పాటు కరోనా నివారణకు టీకా ఒక్కటే శ్రీరామరక్ష కనుక, దేశవ్యాప్తంగా ప్రజలందరికీ టీకా వేసేందుకు కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంది. ప్రజలు కూడా సన్నాయినొక్కులు నొక్కకుండా టీకా వేయించుకుని కరోనా విజృంభణ నుంచి రక్షణ పొందాలి. మాస్కు ధరించడం, భౌతిక దూరం పాటించడం వంటి జాగ్రత్తలు ఎటూ తప్పనిసరి. కరోనాతో మృతిచెందినవారి కుటుంబాలవారికి జీవనోపాధితో పాటు ఆర్థికచేయూతను అందించి, వారిని మానవతా హృదయంతో ఆదుకోవాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలదే. ఈ చర్యలన్నీ వెంటనే యుద్ధప్రాతిపదికన తీసుకోవాల్సి ఉంది.

## హడలెత్తిస్తున్న..'డెల్టా ప్లస్'



కంటికి కనిపించని సూక్ష్మ రాకాసి కరోనా కొత్తఎత్తులతో మానవాళిని మింగడానికి చూస్తోంది. రకరకాలుగా రూపం మార్చుకొని కొత్త వేరియంట్‌లతో విజృంభిస్తోంది.వాటిని చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో 'డెల్టా ప్లస్' వేరియంట్ మరింత ప్రమాదకరంగా పరిణమించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, దీని ప్రభావం ఏమేరకు ఉంటుందో చెప్పలేమని కూడా మరికొందరు అంటున్నారు. ఏదేమైనా.. ఈ మాయదారి వ్యాధి నుంచి బయటపడేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవడమే ముఖ్యం. వ్యాక్సిన్ ఒక్కటే కరోనా కట్టడికి శ్రీరామరక్ష కనుక ప్రతిఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలి. దేశంలో అందరికీ వ్యాక్సిన్ వేసేందుకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు వేగవంతమైన చర్యలు తీసుకోవాలి.

## ఏకాంతంగా.. రామతీర్థం బ్రహ్మోత్సవాలు



విడవలూరు మండలం లోని సముద్రతీర ప్రాంతం రామతీర్థం గ్రామంలో వెలసి ఉన్న ప్రఖ్యాత పుణ్యక్షేత్రం కామాక్షిదేవి అమ్మవారి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జూన్ 30 నుంచి ఏకాంతంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. కరోనా నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ సూచనలతో బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. జులై 9వ తేదీ దాకా ఈ ఉత్సవాలు జరుగుతాయి. దేవాదాయశాఖ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఇ.ఓ వెంకటేశ్వర్లు, ఇన్స్‌పెక్టర్ చైతన్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పర్యవేక్షిస్తున్నారు.

## స్నేహమంటే ఇదే!..

- కోవిడ్‌తో మరణించిన స్నేహితుల కుటుంబాలకు చేయూత
- జడ్పీ పూర్వ విద్యార్థుల ఔదార్యం



సంతోషాల్లో పాలుపంచుకోవడమే కాదు..ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడమే స్నేహధర్మం. దానిని నిరూపించుకున్నారు నెల్లూరు జడ్పీ స్కూలు పూర్వ విద్యార్థులు. తమతో చిన్నతనంలో కలిసి చదువుకున్న ముగ్గురు స్నేహితులు ఇటీవల కరోనాతో మృత్యువాతపడడంతో ఆ కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. ఆ విషయం తెలుసుకున్న స్నేహితులంతా కలిసి తమకు తోచిన సాయం అందించి ఆ కుటుంబాలకు అండగా నిలిచారు. 75వేల రూపాయలు సేకరించి ఒక్కో కుటుంబానికి పాతికవేల వంతున అందించారు. నెల్లూరులోని జడ్పీ స్కూలులో 1994-95లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. వీరితో పాటు చదువుకున్న చెన్నకేశవులు, సత్యనారాయణ, మధు కరోనాతో చనిపోవడంతో ఆ కుటుంబాలకు సాయం చేయాలని ఆరాటపడి ఇటీవల వారి కుటుంబసభ్యులకు ఆ మొత్తాన్ని అందించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బెజవాడ మేఘనాథ్‌సింగ్, కార్యదర్శి చెందులూరు ప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో ఈ స్నేహపూర్వక కార్యక్రమం జరిగింది.

### 'కాపు నేస్తం'కు

## దరఖాస్తు చేసుకోండి

**-బీసీ కార్పొరేషన్ ఇ.డి కృష్ణారావు**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న 'వైఎస్ఆర్ కాపు నేస్తం' పథకానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అర్హులైన కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఇ.డి కృష్ణారావు గతనెల 28న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది ఈ పథకం కింద జిల్లాలో 7250 మంది లబ్దిదారులకు 15వేల రూపాయల వంతున 11.28 కోట్ల రూపాయల దాకా ఆర్థిక సాయం చేయడం జరిగిందని తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేవారి వయసు జూన్ 24వ తేది నాటికి 45 నుంచి 60 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన మహిళలు ఆయా వార్డు, గ్రామ సచివాలయాల్లో జులై 1 నుంచి 7వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. జులై 24వ తేదిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమవుతుందని తెలిపారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## నిబద్ధతకు నిదర్శనమే ఈ స్పందన




గత నాలుగు వారాలుగా లాయర్ పత్రిక చూస్తున్నాను. ప్రపంచం నలు చెరగులా వున్న నెల్లూరీయులు ఎందరో అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఇది నిజంగా నిబద్ధతకు నిదర్శనమే. పత్రిక ఎన్ని సంవత్సరాలుగా ఉంది అనడంకన్నా ఎంత నిబద్ధతో, నిజాయతీతో, నైతిక విలువలతో ఉంది అన్నది చాలా ముఖ్యం. ఆ లక్షణాలన్నీ పుష్కలంగా ఉన్నాయి కాబట్టే 40యేళ్ళనాటి లాయర్‌కి ఈ నాటికీ అదే ఆదరణ లభిస్తోంది. ప్రాంతీయ వార్తలకు ప్రాధాన్యత కల్పిస్తూనే, అవసరాన్ని, సందర్భాన్ని బట్టి జాతీయ అంతర్జాతీయ వార్తలకు కూడా లాయర్ చాలాసార్లు ప్రాముఖ్యత కల్పించడం ముదావహం. ముఖ్యంగా సాహితీ రంగంలోకి కొత్తగా ప్రవేశించే యువ సాహితీవేత్తలను ప్రోత్సహించడం రాజగోపాలరెడ్డి గారి తరం నుండి ఈరోజు వరకు ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు నిర్వాహకులు. లాయర్ సారధులకు, సిబ్బందికి నా అభినందనలు.

పుట్టా హరిత, గూడూరు.

## 'లాయర్' రాతలు నిష్పక్షపాతంగా ఉంటాయి

చిన్నపత్రికే అయినా పెద్దపత్రికలకు దీటుగా ఎంతోకాలం నుంచి లాయర్ పత్రిక వారం వారం వస్తూనే ఉంది. చదువుతూనే ఉన్నాం. నాలాంటి పాఠకులు ఎందరో ఉంటారు కూడా. లాయర్ రాతలు నిష్పక్షపాతంగా ఉండడం నాకెంతో నచ్చే విషయం. లాయర్‌లో వచ్చే అనేక విషయాలు ఆసక్తికరంగా ఉంటున్నాయి. వార్తలైనా, వ్యాసాలైనా చదివించే గుణంతో చాలా పొందికగా ఉంటున్నాయి. అప్పుడప్పుడూ ప్రత్యేక అనుబంధాలుగా వస్తున్న కొన్ని లాయర్ విశేష సంచికలు కూడా నేను చూశాను. చదివితే ఎంతో బాగున్నాయి. ఎంతో సమాచారం ఉంది వాటిల్లో.. ఎంత చదివినా ఇంకా ఎంతో మిగిలే ఉంది. నెల్లూరుజిల్లా గురించి తెలియని విషయాలెన్నో తెలిశాయి. ముద్రణ కూడా గందరగోళంగా లేకుండా చక్కగా ఉంటుంది. పత్రిక ముద్రణకు ఉపయోగించే కాగితం ఎంతో క్వాలిటీగా ఉంటుంది. సాధారణంగా చిన్నపత్రికలు ఇంతకాలం మనుగడ సాధించడం ఎంతైనా అరుదే. అలాంటి మంచి ఘనతను లాయర్ సాధించడం గొప్ప విషయం. మరెన్నో పుట్టినరోజు పండుగలు లాయర్ చేసుకోవాలని ఆకాంక్షిస్తూ.. అభినందిస్తూ.. 40 ఏళ్ళ లాయర్‌కు శుభాకాంక్షలు!..

ఎస్.ఎం.వెంకటేశ్వర్లు, నెల్లూరు.

### పొదలకూరు పాఠశాలకు...

# జాతీయస్థాయి ప్రశంసలు

పొదలకూరు పట్టణంలోని డిఎన్ఆర్ జడ్పీ బాలుర ఉన్నతపాఠశాల సర్ సివి రామన్ సైన్స్‌క్లబ్‌కు జాతీయస్థాయి ప్రశంసా పత్రం లభించింది. విజ్ఞాన్‌ప్రసార్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహిస్తున్న సైన్స్ క్లబ్‌లలోని కార్యక్రమాలను పరిశీలించిన విజ్ఞాన్‌ప్రసార్ వారు ప్రశంసనీయమైన విధంగా పనిచేస్తున్న క్లబ్‌లను ఎంపిక చేయగా, అందులో పొదలకూరు పాఠశాలకు ఈ ప్రశంస లభించింది. దీంతె పాఠశాల కోఆర్డినేటర్, సైన్స్ టీచర్ ఏవి సుధాకర్‌కు ప్రశంసాపత్రాన్ని పంపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో 2019లో సర్ సివి రామన్ క్లబ్‌ను ఏర్పాటుచేశామని, డిఆర్‌డిఓ ఛైర్మెన్ మన సతీష్‌రెడ్డి చేతుల మీదుగా ఈ క్లబ్ ప్రారంభమైందని చెప్పారు. కరోనా కాలంలో ఈ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా, సామాజిక అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అనంతరం సుధాకర్‌ను పాఠశాల హెడ్మాస్టర్ సనత్‌కుమార్ అభినందించారు.

# అమూల్‌తో కలసి పనిచేస్తాం

### - విజయ డెయిరీ నాయకులు, అధికారులు



పాడిరైతుల మేలు కోరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రఖ్యాత సంస్థ 'అమూల్'తో కలసి పనిచేస్తామని నెల్లూరులోని విజయ డెయిరీ నాయకులు, అధికారులు గతనెల 29న విజయవాడలో ఉన్న పాడిపరిశ్రమశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును కలసి విన్నవించారు. ఆప్కాబ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు ఆధ్వర్యంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆ సంస్థ ఎం.డి కృష్ణమోహన్‌రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కృష్ణమోహన్, బోర్డు డైరెక్టర్ సిహెచ్ కృష్ణారెడ్డి మంత్రిని కలసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం తాము పది రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నామని, నాణ్యమైన సామగ్రిని అందజేస్తే ఐస్‌క్రీమ్, జున్ను వగైరాలను కూడ ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకు మంత్రి అప్పలరాజు స్పందించి, త్వరలోనే ఈ విషయాన్ని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

### గురుకులాల్లో ప్రవేశానికి..

# దరఖాస్తు చేసుకోండి

మహాత్మా జ్యోతిరావు పూలే (ఏపి) వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కాలేజీల్లో ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాలల, జూనియర్ కళాశాలల జిల్లా కన్వీనర్ కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కోట, దొరవారిసత్రం బాలుర జూనియర్ కాలేజీల్లో ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి కోర్సులు ఉన్నాయని, ఒక్కో గ్రూపులో 40 సీట్ల వంతున మొత్తం 160 సీట్లు ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా జులై 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2020-21వ సంవత్సరంలో పదోతరగతి చదివినవారు మాత్రమే అర్హులని, తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి లక్ష రూపాయల మించి ఉండకూడదన్నారు. గురుకులాల్లో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివరాలకు 90008 66912, లేదా 82476 98231 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### కామాక్షమ్మ దేవాలయంలో..


# దర్శన వేళలు

జొన్నవాడలోని శ్రీమల్లికార్జున సమేత శ్రీకామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో జులై 1 నుంచి ఆలయ దర్శన వేళలను మార్పుచేశారు. ఇకనుంచి ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట దాకా, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల దాకా దర్శనానికి భక్తలను అనుమతించనున్నట్లు ఆలయ ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నిర్ణీత వేళల్లో భక్తులు ఆలయ దర్శనం చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

### చెంగాళమ్మ హుండీ


# ఆదాయం 17.63 లక్షలు

సూళ్లూరుపేట చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో గతనెల 29న హుండీలను లెక్కించగా మూడు నెలలకుగాను 17,63,719 రూపాయలు రాబడి వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. 20 అమెరికన్ డాలర్లు కూడా వచ్చాయన్నారు. గూడూరు దేవాదాయ ఇన్స్‌పెక్టర్ ఎం.సుధీర్‌బాబు సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది.



# అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## - జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో ప్రభుత్వం పనిచేస్తోందని, రైతులకు అండగా ఉంటూ వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడంలో రాష్ట్రం ముందుంటోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. గతనెల 27న నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మంత్రులు రంగనాధరాజు, డాక్టర్ అనిల్, మేకపాటి గౌతంరెడ్డిలతో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బాలినేని మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల కోసం ఎన్నో పథకాలు అమలవుతున్నాయన్నారు. రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందేలా చేస్తున్నామన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఆయన కొనియాడారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకును కొనుగోలు ఏసి పొగాకు రైతులను ఆదుకున్నారన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, దాని ఆధారంగానే పంటల కొనుగోళ్ళు, ఎరువులు విత్తనాలు పంపిణీ వగైరాలన్నీ జరుగుతున్నాయని తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో రైతు సలహామండలి సభ్యులు సమావేశమయ్యేందుకు ఒక కార్యాలయం ఏర్పాటుచేయాలని మంత్రికి సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# మత్తు జోలికిపోతే..
# జీవితాలు చిత్తే



## - సెబ్ జేడీ శ్రీలక్ష్మి

మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల జోలికిపోతే జీవితాలు సర్వనాశనం అవుతాయని, వాటికి అందరూ దూరంగా ఉండాలని ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి చెప్పారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈనెల26న జిల్లా పోలీసు కార్యాలయంలోని జేడీ చాంబర్లో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును అంధకారమయం చేసుకోవద్దని ఆమె విద్యార్థులకు, యువతకు సూచించారు. మొదట్లో అదొక ఫ్యాషన్‌గా మత్తుపదార్థాలను వాడడం ప్రారంభిస్తారని, చివరికి అదే వ్యసనమైపోతుందని, నేరాలు ఘోరాలకు కూడా పాల్పడుతుంటారని, మత్తుపదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు ఒక కంట కనిపెడుతుండాలన్నారు. దేశ భవిష్యత్తుకు వెన్నెముక వంటి విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకూడదన్నారు. యువత పెడదోవ పట్టకుండా తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలన్నారు. పిల్లలు చెడు వ్యసనాలకు లోనై ప్రాణాల మీదికి తెచ్చుకోకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తుపదార్థాలను వాడడం వల్ల ఆరోగ్యం క్షీణించిపోతుందని, అవి అలవాటైతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 22వ తేది నుంచి స్థానిక పోలీసుల సహకారంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది మే నెలలో ఎస్ఇబి ఏర్పాటైనప్పటి నుంచి జిల్లాలో నిత్యం తనిఖీలు ముమ్మరం చేశామన్నారు, గంజాయి, నిషేధించబడిన గుట్కా విక్రయాలు, అనధికారికంగా మద్యం విక్రయాలు, నాటుసారా తయారీ, ఎర్రచందనం, ఇసుక అక్రమరవాణా వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవన్నారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి ఇప్పటిదాకా 29 కేసులు నమోదుచేసి 67 మందిని అరెస్ట్ చేయడం జరిగిందని, అదేవిధంగా గుట్కాల విషయమై 139 కేసులు నమోదుచేసి 252 మందిని అరెస్టు చేశామన్నారు.

# ఆనందయ్య ట్రస్ట్‌కు జనసేన లక్ష విరాళం



కరోనా నివారణకు ఆయుర్వేద మందును తయారుచేసి అందరికీ ఉచితంగా అందిస్తున్న ఆనందయ్య ట్రస్ట్‌కు జనసేన పార్టీ తరఫున లక్ష రూపాయల విరాళం అందించారు. ఆ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో గతనెల 27న నెల్లూరులోని ఆనందయ్య నివాసంలో ఆయన విరాళం చెక్కును అందజేశారు. ఈ కరోనా కష్టకాలంలో ఆనందయ్య ఆయుర్వేద మందుతో ప్రజలకు ధైర్యాన్నిచ్చారని, ఎంతోమందికి ఆ మందును ఉచితంగా అంద జేయడం గొప్ప విషయమని ఆయన కొనియాడారు.

## గ్రామాల అభివృద్ధికి..
# 'ఉన్నత్ భారత్ అభియాన్'

గ్రామాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉన్నత్ భారత్ అభియాన్' పథకం ఎంతగానో తోడ్పడుతుందని విఎస్‌యు ఇన్‌చార్జి ఉప కులపతి బి.రాజశేఖర్ అన్నారు. ఈ పథకంలో భాగంగా ఈనెల 26న 'కోవిడ్ నియంత్రణ, నిర్వహణ, ప్రవర్తన, ఆవశ్యకత' అనే అంశంపై ఆన్‌లైన్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామీణప్రాంతాల్లోని యువకుల సహకారంతో గ్రామాలను బాగా అభివృద్ధి చేసుకోవచ్చని, కరోనా వల్ల దేశానికి ఎంతో నష్టం జరిగిందని, థర్డ్‌వేవ్ కూడా వస్తుందని శాస్త్రవేత్తలు చెప్తున్న నేపథ్యంలో అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచంచారు. డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, విఎస్‌యు రెక్టార్ చంద్రయ్య, రిజిస్ట్రార్ ఎల్వీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్ పాల్గొన్నారు.


40 లాయర్ YEARS



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

చిన్న అడుగుతో మొదలైన ప్రస్థానం
పత్రికా రంగంలో చెక్కు చెదరని స్థానం
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు.

డా॥ ఎం.తిరుపతిరెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్

Samyuktha
సంయుక్త ఫౌండేషన్స్ ప్రై. లి.
చెన్నై.






## అందమైన వస్తువులకు..

# 'అమ్మ ఇంటీరియో'

## నెల్లూరు చిల్డ్రన్స్‌పార్క్ వద్ద కొత్త ఫర్నిచర్ మాల్

నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులో గతనెల 27న ప్రారంభమైన 'అమ్మ ఇంటీరియో' ఫర్నిచర్ మాల్ అందరినీ బాగా ఆకట్టుకుంటూ వినియోగదారుల నుంచి విశేషాదరణ పొందుతోంది. అంతర్జాతీయస్థాయి హంగులతో నెలకొల్పబడిన ఈ మాల్‌లో వివిధరకాల ఫర్నిచర్‌తో పాటు ఇంటీరియర్ రంగంలో ఎంతో నాణ్యత కలిగిన వస్తువులు, అన్ని రకాల ఆకర్షణీయమైన గృహకోపకరణాలను సంస్థ నిర్వాహకులు వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చారు. కొత్తదనాన్ని కోరుకునే సింహపురీయులకు ఇదొక సదవకాశం. ఇళ్ల లోగిళ్లను, భవనాల లోపలి భాగాలను మరింత సుందరంగా రూపుదిద్దుకునేందుకు 'అమ్మ ఇంటీరియో' ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇంటీరియర్ డెకరెషన్స్‌కు ఉపయోగపడే అనేకరకాల నాణ్యమైన వస్తువులు ఇక్కడ లభ్యమవుతాయని అమ్మ గ్రూప్ ఛైర్మెన్ గడ్డం సుధాకర్‌రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. ఫర్నిచర్ రంగంలో జిల్లా ప్రజలకు దాదాపు రెండు దశాబ్దాలుగా ఉత్తమమైన, నమ్మకమైన సేవలందించిన తమ సంస్థ తాజాగా 'అమ్మ ఇంటీరియో'ను ప్రారంభించి జిల్లా ప్రజానీకానికి తన సేవలను విస్తరిస్తోందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అమ్మ గ్రూప్ అధినేతలు గడ్డం సుమన్‌రెడ్డి, సృజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు



జిల్లా క్రైమ్స్ ఏఎస్పీగా వెంకటేశ్వరరావు నెల్లూరుజిల్లా పోలీస్ కార్యాలయంలో ఈనెల 26న బాధ్యతలు చేపట్టారు. సిసిఎస్ డిఎస్పీ శివాజీరాజా, ఇన్‌స్పెక్టర్ బాబీజాన్ సైదా, పోలీసు సిబ్బంది ఆయన్ను కలసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.

## అన్ని వసతులతో..

# పేదలకు జగనన్న కాలనీలు


### - మంత్రులు రంగనాథరాజు, బాలినేని, డాక్టర్ అనిల్, గౌతంరెడ్డి

నవరత్న పథకాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న కాలనీలు అత్యద్భుతంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని మంత్రులు స్పష్టం చేశారు. ఈనెల 26న నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి రంగనాథరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్ కుమార్‌యాదవ్, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు జగనన్న కట్టిస్తున్న ఇళ్ళు పక్కాగా, అన్ని వసతులతో సంతోషదాయకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంత్రి రంగనాథరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్ళ నిర్మాణానికి అర్థిక సాయం మాత్రమే చేసేవారని, వైకాపా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో రాష్ట్రంలోని ప్రతి పేదవానికి ఉచితంగా స్థలాలిచ్చి ఇళ్ళు కట్టించడం చరిత్రాత్మకమైన విషయమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17వేల జగనన్న కాలనీల నిర్మాణం జరుగుతోందన్నారు. జిల్లాకు తొలిదశలో 53,953 ఇళ్ళను కేటాయించామని, జగనన్న కాలనీల్లో విద్యుత్,




తాగునీరు, రోడ్డు వసతి ఇలా అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఇళ్ళ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రతి ఇంటి నిర్మాణానికి లక్షా 80 వేల రూపాయలు అందిస్తున్నామన్నారు. 70 శాతం సబ్సిడీతో ఇళ్ళు పూర్తయ్యేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఇళ్ళు కట్టుకోలేని పేదలకు ప్రభుత్వమే ఇళ్ళు కట్టిస్తుందన్నారు. జగనన్న కాలనీలు వచ్చాక ఒక్కో లబ్దిదారునికి ప్రభుత్వం తరఫున కనీసం 15 లక్షల రూపాయల ఆస్తి వచ్చినట్లవుతుందన్నారు. ఈ సందర్భంగా ఇళ్ళ నిర్మాణాల విషయమై పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన సూచనలను సిఎం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారిగా.. శ్రీనివాసులు



జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారిగా బుచ్చి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆదూరు శ్రీనివాసులు ఈనెల 26న బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, ఎయిడెడ్ కళాశాలల్లో అడ్మిషన్లను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. తొలుత శ్రీనివాసులుకు శుభాకాంక్షలు చెప్తూ ఆర్ఐఓ మాల్యాద్రి, పలువురు సిబ్బంది సన్మానించారు.



# కుటుంబాలకు అండగా ఉంటాం

## - కమాండెంట్ నాగేంద్రరావు



వెంకటగిరి బెటాలియన్ సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని వెంకటగిరి 9వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు చెప్పారు. ఇటీవల మరణించిన బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి కుటుంబసభ్యులకు భద్రతా పథకం ద్వారా 3,94,540 రూపాయల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్ సిబ్బంది అందరూ కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరమ్మ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# పేద చేనేతకారులకు చేయూత



కరోనా నేపథ్యంలో పనులు లేక, జీవనం గడవక అష్టకష్టాలు పడుతున్న అనేక మంది పేద చేనేత కార్మికుల కుటుంబాలకు ఇటీవల ఆంధ్రప్రదేశ్ వీవర్స్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేసి వారికి తమ చేయూతనందించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సజ్జా వెంకట సురేష్ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో ఇప్పటిదాకా 1200 మంది పేద చేనేతకారులకు నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. నిరుపేదలైన చేనేతకారులను ఈ కష్టకాలంలో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ పముజుల శంకర్‌ల నేతృత్వంలో ఈ పంపిణీ జరిగింది. చేనేత నాయకులు ఊకోటి లక్ష్మీనారాయణ, సిహెచ్ సుబ్రహ్మణ్యం, ఎస్ భాస్కర్, పముజుల శ్రీనివాసులు, పెంచలయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా

# శ్రీనివాస కళ్యాణం



పొదలకూరు శ్రీనివాసనగర్‌లో కొలువైవున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గతనెల 27న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం జరిగింది. శ్రీ వేంకటేశ్వరుని జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున కన్నుల పండువగా జరిగిన ఈ వేడుకలో ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు.

# రేషన్‌బియ్యం పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం నుంచి నెల్లూరుకు తరలిస్తున్న 60 బస్తాల రేషన్‌బియ్యాన్ని కోవూరు ఎస్ఐ చింతం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 26న పోలీసులు పట్టుకున్నారు. కోవూరు సమీపంలోని సాలుచింతల సెంటర్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఓ వాహనంలో రేషన్ బియ్యం బయటపడ్డాయి. వాహన డ్రైవర్‌ను విచారించగా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కొందరు ఒక ముఠాగా ఏర్పడి రేషన్‌కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి మిల్లులకు అమ్ముకుంటున్నట్లు వెల్లడించడంతో బియ్యంతో సహా ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## గ్రావెల్ కుంభకోణం బయటపడుతుందనే...

# మాపై అక్రమ కేసులు

## రూరల్ డిఎస్పీ దృష్టికి తీసుకువచ్చిన టిడిపి నేతలు



జిల్లాలో జరుగుతున్న కోట్లాది రూపాయల గ్రావెల్ కుంభకోణం ఎక్కడ బయటపడిపోతుందోననే ఉద్దేశంతోనే తమపై రాజకీయనాయకుల వత్తిడితో పోలీసులు అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారంటూ పలువురు టిడిపి నేతలు గతనెల 28న నెల్లూరు రూరల్ డిఎస్పీ హరినాథ్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. గ్రావెల్ కుంభకోణాన్ని నిష్పక్షపాతంగా విచారించేందుకు విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని కోరుతూ తాము హైకోర్టును ఆశ్రయించబోతున్నామని చెప్పారు. నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నెల్లూరు నగర టిడిపి ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు బొమ్మి సురేంద్ర, జెన్ని రమణయ్య, ఎస్‌సి కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవీంద్ర, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు రావూరి రాధాకృష్ణమనాయుడు తదితరులంతా డిఎస్పీని కలిసి, గ్రావెల్ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్ళించడానికే తమపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని వివరించారు. సర్వేపల్లి రిజర్వాయర్, కంటేపల్లి అటవీభూముల నుంచి లక్షల క్యూబిక్‌మీటర్ల గ్రావెల్ తవ్వి తరలించేస్తున్నారని, రిజయర్వాయర్‌లో ఇచ్చిన అనుమతులకన్నా 10వేల క్యూబిక్‌మీటర్ల గ్రావెల్‌ను అదనంగా తవ్వి తరలించేస్తున్నారని నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరే పోలీసులకు ఫిర్యాదుచేశారని వారు గుర్తు చేశారు. మైనింగ్ మాఫియాపై నమోదైన కేసుల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒట్టూరు సంపత్‌రాజు, సాబిర్‌ఖాన్, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## తెలుగు వెలుగు కోసం...

# అందరూ సంఘటితం కావాలి

## – ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన



**తెలుగు భాష పరిరక్షణ కోసం ఉద్యమస్ఫూర్తితో తెలుగు వాళ్ళంతా ముందుకు సాగాలని భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. తెలుగు భాష పరిరక్షణ, వ్యాప్తి ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాల్సిన అవసరం ఉందని కూడా ఆయన నొక్కి చెప్పారు. మాతృభాషలో చదువుకుంటే ఎదగలేమనే అపోహలను ఇకనైనా వదిలిపెట్టి తెలుగువాళ్ళంతా మాతృభాష పరిరక్షణకు, మన సంస్కృతి సంప్రదాయాలు, సంగీతం, సాహిత్యం, ఆచార వ్యవహారాల పునరుజ్జీవానికి కృషి చేయాలన్నారు. విశాఖపట్నంలోని పోర్టు ట్రస్ట్ అతిథిగృహం నుంచి ఆయన ఈ విషయాలపై అనర్ఘళంగా మాట్లాడి తెలుగు వెలుగుల కోసం తపిస్తూ చేసిన ప్రసంగం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది.**


తెలుగు వెలుగు కోసం తెలుగు వాళ్ళంతా సంఘటితం కావాలని, తెలుగు భాష పరిరక్షణ ఒక ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. గతనెల 27న రాష్ట్రేతర తెలుగు సమాఖ్య 6వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భాషను విస్మరిస్తే మన సంస్కృతి, సాహిత్యం, ఆచార వ్యవహారాలు, అలవాట్లు, కట్టుబాట్లు అన్నీ భావితరాల వారికి దూరమయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల తెలుగువాళ్ళంతా భాష పరిరక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు. మనుషులనే కాక తరాలను సైతం కలిపే గొప్ప శక్తి భాష, సంస్కృతులకు ఉన్నాయని ఆయన అంటూ, భాష అభివృద్ధికి ప్రభుత్వాలు చేస్తున్న కృషి చాలదని, భాష పరిరక్షణ ప్రజా ఉద్యమంగా రూపుదాల్చకపోతే భాషను పరిరక్షించుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. “మనల్ని సంఘటితంగా ఉంచే మొదటి గొలుసు మాతృభూమి అయితే, రెండో గొలుసు భాష, సంస్కృతి, మన ఆట, పాట, భాష, యాస, గోస, కట్టుబొట్టు వంటి సంప్రదాయాలను పునరుజ్జీవింపజేసుకోవాలన్నారు. తెలుగు వాళ్ళంతా తెలుగులో మాట్లాడడం, ప్రభుత్వాలు మాతృభాషను ప్రోత్సహించేలా వత్తిడి తీసుకురావడం అవసరమన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల ఘనతను సగర్వంగా చాటుకునేందుకు అందరూ కృషిచేయాలన్నారు. పరభాషా వ్యామోహం నుంచి బయటపడాలని, ఇతర భాషల్లోకి తెలుగు సాహిత్య అనువాదానికి ప్రభుత్వాలతో పాటు తెలుగు సంస్థలు చొరవ తీసుకోవాలని చెప్పారు. తెలుగు రాష్ట్రాల వెలుపల సుమారు వెయ్యికి పైగా సంస్థలు భాష, సంస్కృతుల పరిరక్షణకు పాటు పడుతున్నాయని, ఇవన్నీ రాష్ట్రేతర తెలుగు సమాఖ్య ద్వారా ఏకతాటిపైకి వచ్చి సంగీత, సాహిత్య, భాషాభివృద్ధి కార్యక్రమాలతో తెలుగు సమాజ నిర్మాణానికి చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన ప్రశంసించారు.

### ప్రాథమిక విద్య మాతృభాషలో సాగాలి :

ప్రాథమిక విద్య మాతృభాషలో సాగడం వల్ల విద్యార్థులు భాషను నేర్చుకోవడం సులభతరమవుతుందని, నూతన విద్యా విధానం మాతృభాషకు పెద్దపీట వేయడం సంతోషదాయకమని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అందరూ మాతృభాషలో విద్యను అభ్యసించి ఎదిగిన వారేనని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పశ్చిమ బెంగాల్ మంత్రి శశి పంజా, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య అధ్యక్షుడు సుందర రావు, కార్యదర్శి పివిపిసి ప్రసాద్, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు, చెన్నైలో తెలుగుభాష అభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్న మన నెల్లూరీయుడు డా. సిఎంకె రెడ్డి పాల్గొన్నారు.



# జేసీ బాపిరెడ్డి బదిలీ



జిల్లా జాయింట్ కలెక్టర్ (ఆసరా, సంక్షేమం) టి.బాపిరెడ్డి మళ్ళీ బదిలీ అయ్యారు. ఇటీవలే ఆయన ప్రకాశం జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చి జేసీగా నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. తాజాగా గతనెల 29న విజయవాడలోని నీటి పారుదల శాఖకు చెందిన కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(సిఏడిఏ) స్పెషల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కాగా బాపిరెడ్డి గతంలో నెల్లూరుజిల్లాలో వివిధ శాఖల్లో అధికారిగా పనిచేశారు. ఆత్మకూరు ఆర్డీఓగా, జడ్పీ సిఇఓగా, డ్వామా, ఐసిడిఎస్‌లకు పి.డిగా, నుడా వైస్‌ఛైర్మెన్‌గా, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా, పెద్దాసుపత్రి కోవిడ్ నోడల్ అధికారిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

# సెబ్ డీసీగా హేమంత నాగరాజు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) నెల్లూరు జోన్ డెప్యూటి కమినషర్‌గా కె. హేమంత నాగరాజును నియమిస్తూ రాష్ట్ర డిజిపి గౌతం సవాంగ్ గతనెల 29న ఉత్తర్వులిచ్చారు. సెబ్ కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన్ను నెల్లూరుకు బదిలీ చేయడంతో త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అదేవిధంగా సెబ్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసాచారిని కర్నూలు అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఏలూరులో ఇ.ఎస్‌గా పనిచేస్తున్న ఎస్.రవికుమార్‌ను గూడూరు ఇ.ఎస్‌గా నియమించారు.

# బిజెవైఎం కొత్త కార్యవర్గం

భారతీయ జనతా యువమోర్చా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ కమిటీని గతనెల 29న బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కె.కిరణ్, కె.మాధవ్, ఎం.శివ, ఎన్.ప్రియ, ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్ చంద్ర, ఎస్.శ్రీనివాసులు, కార్యదర్శులుగా ఎస్.హజరత్, పి.వంశీ, ఎస్‌కె మస్తాన్, ఎం.ప్రవీణ్, ఎం.శ్రీనివాసులు రెడ్డిని ఎన్నిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సోషల్‌మీడియా ఇన్‌చార్జిగా వి.హర్ష, కార్యవర్గసభ్యునిగా బి.మహేంద్ర ఎన్నికైనట్లు తెలిపారు.

## నెల్లూరు కబుర్లు

### 'దిశ' యాప్‌పై

# అందరికీ అవగాహన కలిగించాలి

### - వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం జగన్



మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన 'దిశ' యాప్‌పై ఇంటింటికి వెళ్ళి అవగాహన కలిగించి, ప్రతి మహిళతో ఈ యాప్ డౌన్‌లోడ్ చేయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పోలీసులకు, వలంటీర్లకు సూచించారు. గతనెల 29న విజయవాడలోని గొల్లపూడిలో సామూహిక దిశ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఏఎస్పి వెంకటరత్నం, ఎస్‌ఇబి జాయింట్ డైరెక్టర్ కె.శ్రీలక్ష్మితో పాటు 'దిశ' పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఏవి రమణ, మహిళా పోలీసులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# టీకాకు ఇక దిగుల్లేదు

### - డిఎండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి

జిల్లాకు కోవిడ్ టీకాకు ఇక ఎలాంటి కొరత లేదని, 50వేల డోసుల కోవిషీల్డ్, మరో 5వేల డోసుల కోవాగ్జిన్ టీకా వచ్చేశాయని, వీటిని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, పట్టణ ఆరోగ్యకేంద్రాలకు పంపామని డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి ఇటీవల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయిదేళ్ళ లోపు పిల్లలున్న తల్లులకు కోవిషీల్డ్ మొదటి డోసు టీకా వేస్తున్నామని తెలిపారు. అర్హులైనవారికి రెండో డోసు కోవాగ్జిన్ టీకా కూడా వేస్తున్నారన్నారు. టీకా వేయించుకునేవారు ఆరోగ్యకేంద్రాల్లో కోవిడ్ నిబంధనలను అనుసరించి భౌతికదూరం పాటించాలన్నారు. కోవిడ్ నిరోధానికి అందరూ తప్పనిసరిగా టీకా వేసుకోవాలని ఆమె కోరారు.

### రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పుట్టినరోజున


# వాత్సల్య చిన్నారులకు పుస్తకాలు



నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తన పుట్టినరోజు వేడుకలను కుటుంబసభ్యులతో కలసి నగరంలోని జనహిత-వాత్సల్య అనాధ శరణాలయంలో జరుపుకుని అందరికీ మార్గదర్శకంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన వాత్సల్య చిన్నారులకు పుస్తకాలు, ఆహార పొట్లాలు, బిస్కెట్ ప్యాకెట్లు వగైరాలను అందజేశారు. గతనెల 26న జరిగిన ఈ కార్యక్రమంలో వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జివి సాంబ శివరావు మాట్లాడుతూ కృష్ణచైతన్య విద్యాసంస్థల ద్వారా విద్యార్థులకు చంద్రశేఖర్‌రెడ్డి ఎంతగానో సేవలు చేస్తున్నారని అభినందించారు. వాత్సల్య చిన్నారులకు ఆయనందించిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వాత్సల్య చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# సిఐల బదిలీలు

జిల్లాలోని పలువురు పోలీస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్లను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమవర్మ గతనెల 28న ఆదేశాలు జారీ చేశారు. కలిగిరి సిఐగా పనిచేస్తున్న జిఎల్ శ్రీనివాసరావును రేంజ్ కార్యాలయానికి బదిలీచేసి, ఆ స్థానంలో రేంజ్ కార్యాలయంలో ఉన్న ఎస్.సాంబశివరావును నియమించారు. అదేవిధంగా నెల్లూరు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో సిఐగా పనిచేస్తున్న మిద్దె నాగేశ్వరమ్మను గూడూరు పట్టణ సిఐగా నియమించారు. కాగా, గూడూరులో సిఐగా పనిచేస్తున్న దశరథరామయ్యను నెల్లూరు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు కొద్దిరోజుల క్రితం బదిలీ చేశారు.



# ఆత్మకూరు ప్రజల రుణం తీర్చుకుంటా

## - మంత్రి మేకపాటి గౌతంరెడ్డి

తనకు రాజకీయ జీవితాన్నిచ్చిన ఆత్మకూరు ప్రజల రుణం తీర్చుకుంటానని, వరుసగా రెండుసార్లు భారీమెజార్టీతో తనను గెలిపించిన ఆత్మకూరును అన్ని విధాల అభివృద్ధి చేసి తీరుతానని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి చెప్పారు. నియోజకవర్గ యువతకు ఉద్యోగాలు, ఉపాధి సౌకర్యాలు పెంచడంతో పాటు, ఈ ప్రాంతంలో మంచి పరిశ్రమలు పెట్టేందుకు కృషిచేస్తానని ఆయన తెలిపారు. గత నెల 26న ఆత్మకూరులో కొత్త మునిసిపల్ కార్యాలయ భవనానికి ఆయన ప్రారంభోత్సవం చేసి మాట్లాడుతూ మునిసిపల్ కౌన్సిలర్లు రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఇండస్ట్రియల్ పార్కులో త్వరలో 900 కోట్లతో కొత్త పరిశ్రమ వస్తుందని, ఏడాదిలోపే మరో 600 కోట్లతో మరో పరిశ్రమ కూడా రానుందని, వీటివల్ల ఇక్కడి యువతకు మంచి ఉపాధి దొరుకుతుందని అన్నారు. ఆత్మకూరులోనూ అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎంపికైన మహబూబ్‌బాషా, కొత్తపల్లి రమేష్, నందవరం కృపావరమ్మలతో మంత్రి మేకపాటి సమక్షంలో ప్రమాణం స్వీకారం చేశారు. అనంతరం మంత్రి గౌతంరెడ్డిని కౌన్సిలర్లు, అధికారులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో ఆత్మకూరు



వైకాపా పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద రెడ్డి, మునిసిపల్ వైస్‌ఛైర్మెన్ షేక్ సర్దార్‌లతో పాటు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, చల్లా రవికుమార్ రెడ్డి, షేక్ పర్వీన్, కొండా వెంకటేశ్వర్లు, కేతా వేణుగోపాల్‌రెడ్డి, కేతా రవి పాల్గొన్నారు.

## జులై 6 దాకా..'వాహనమిత్ర'కు గడువు



- డిటిసి సుబ్బారావు

'వాహనమిత్ర' పథకానికి సంబంధించి 2021–22 ఆర్థిక సంవత్సరానికి రెండోవిడత వాహనమిత్ర దరఖాస్తులకు రాష్ట్రప్రభుత్వం జులై 6వతేది దాకా గడువు పొడిగించిందని, వాహనమిత్ర లబ్దిదారులు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఉప రవాణా కమిషనర్(డిటిసి) సిహెచ్‌వికె సుబ్బారావు ఇటీవల ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆ దరఖాస్తులను జులై 8వతేది లోపు వెల్ఫేర్ అసిస్టెంట్లు పరిశీలించి, 10వతేది లోపల ఎంపిడిఓ, లేదా మునిసిపల్ కమిషనర్లు ఆమోదించిన తర్వాత, అర్హత కలిగిన లబ్దిదారులకు జులై 12లోగా జిల్లా కలెక్టర్ ఆమోదించడం జరుగుతుందని తెలిపారు. జులై 15న లబ్దిదారులందరికి ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతాయన్నారు.




## సామాజిక సేవల్లో...

# రోటరీక్లబ్‌ల పాత్ర అమోఘం

## ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వర్తించడంలో రోటరీక్లబ్‌ల పాత్ర ఎంతో అమోఘమైనదని, ఎంతోమంది పేదలకు, దీనులకు రోటరీ చేస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు.

నెల్లూరులోని ఏనుగ సుందరరామిరెడ్డి కల్యాణమండపంలో గతనెల 28న 2021-22 సంవత్సరానికి నెల్లూరు రోటరీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేమిరెడ్డి మాట్లాడుతూ రోటరీక్లబ్‌ల ద్వారా సమాజానికి జరుగుతున్న సేవలు అమూల్యమైనవన్నారు. నెల్లూరు రోటరీక్లబ్ అంటే చిరస్థాయిగా గుర్తుండిపోయేలా సేవలందించాలని కోరారు. రోటరీక్లబ్‌కు తనవంతు సహకారం ఉంటుందని చెప్పారు. తొలుత ఇద్దరు దివ్యాంగులకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా ట్రైసైకిళ్ళు అందజేశారు. అనంతరం 'రోటరీ క్లబ్-నెల్లూరు' అధ్యక్షుడిగా ఉరందూరు విశ్వం, కార్యదర్శిగా ముస్తాక్‌అహ్మద్, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేయగా, వారిని అందరూ అభినందించారు. రోటరీ ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి వీరిచేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐ.లక్ష్మీనారాయణ, కె.శేఖర్‌రెడ్డి, దొరస్వామినాయుడు, షఫీవుల్లా, ఎంఎస్ రెడ్డి, సురేష్ చంద్రారెడ్డి, నారాయణ, ప్రతాప్‌కుమార్, రాఘవేంద్ర శెట్టి, శ్రీనివాసులు, కెవి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఎన్జీఓల సంఘం అధ్యక్షుడిగా మన్నేపల్లి

జిల్లా ఎన్జీఓల సంఘం అధ్యక్షునిగా వైద్యశాఖలో పనిచేస్తున్న మన్నేపల్లి పెంచలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతనెల 27న నెల్లూరులోని ఆ సంఘం సమావేశమందిరంలో జరిగిన ఎన్నికల్లో ఇప్పటిదాకా సంఘానికి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉన్న ఆయన్ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన సిహెచ్‌విఆర్సీ శేఖర్‌రావు ఇటీవల మరణించారు. దీంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. జిల్లా కార్యదర్శిగా నాయుడు వెంకటస్వామి, ఉపాధ్యక్షునిగా నందిమండలం ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొలగమూడి రమేష్‌బాబును కో-ఆప్షన్ పద్ధతిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించారు. సంఘం నాయకులు బి.దస్తగిరిరెడ్డి, బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఎల్.పెంచలయ్య, విజయకుమార్, రాజేంద్రప్రసాద్, రామకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఐవి బాధితులను ఆదరించాలి



హెచ్‌ఐవి బాధితులను అందరూ ఆదరించాలని నెల్లూరులోని అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. ఇటీవల నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవితో బాధ పడుతున్న చిన్నారులను జాలితో కాక, బాధ్యతతో ఆదరించి వారిని ప్రేమగా చూడాలన్నారు. సాంకేతిక సలహాదారు గీతాకృష్ణ తులసీదేవి మాట్లాడుతూ మంచి బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే పిల్లల ఆరోగ్యం బాగుంటుందని, దాతలు అందుకు సహకరించాలని కోరారు. తొలుత పిల్లలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక అకృత్యాలను అరికట్టేందుకు కలెక్టర్ చర్యలు

### ➤ మహిళా అధికారులతో కొత్తగా కమిటీ నియామకం



ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులపై తరచూ లైంగిక వేధింపులు జరుగుతూ ఆయా శాఖలకే అప్రతిష్ట వాటిల్లుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, అలా లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై వెంటనే చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. లైంగిక వేధింపుదారుల అకృత్యాలను అరికట్టేందుకు మహిళా అధికారులను ఒక కమిటీగా నియమించి, ఏ శాఖలో ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే రంగంలోకి దిగి చర్యలు తీసుకోవాలని, మహిళలకు న్యాయం చేసే దిశగా కృషిచేయాలని కొత్తగా కమిటీ వేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో, ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న మహిళల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలను నియమించాలని, తద్వారా ఎక్కడికక్కడ లైంగిక వేధింపుదారులను గుర్తించి వారి పనిపట్టేందుకు ఈ కమిటీలు ఇక అన్ని విధాలైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయం ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళలకు ఎంతో భరోసా కలిగిస్తున్నాయని సర్వత్రా మంచి స్పందన వస్తోంది. కలెక్టర్ తాజా ఆదేశాల మేరకు ఈ లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి జడ్పీ సిఇఓ సుశీల ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మితో పాటు ఉద్యోగినులు కవితారెడ్డి, గీతా కృష్ణతులసీదేవితో పాటు, ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రోజ్‌మాండ్ ఉంటారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళల ఆధ్వర్యంలో వీరు ప్రత్యేక కమిటీలను నియమించాల్సి ఉంది. ప్రభుత్వశాఖల్లో మహిళలకు ఎదురవుతున్న వేధింపులపై ఈ కమిటీ సభ్యులు జిల్లా కమిటీలకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. వేధింపులు జరిగిన శాఖల్లో పరిస్థితిపై వెంటనే వీరు విచారణ జరిపి సంబంధిత మహిళా ఉద్యోగినులకు న్యాయం జరిగేలా అన్నివిధాలైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కొత్త కమిటీల నియామకంతోనైనా పురుష ఉద్యోగుల అకృత్యాలు అణగిపోతాయేమో చూడాలి మరి!...


## 'వాత్సల్య'లో అన్నదానం

నెల్లూరులోని వాత్సల్య అనాధశరణాలయం విద్యార్థులకు స్థానిక 'మానవసేవే మాధవసే' బృందం సభ్యులు గతనెల 28న అన్నదానం చేశారు. వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నర్సు విజయమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ సంఘం నాయకుడు చేజర్ల సుధాకర్‌రావు, పుల్లారెడ్డి, విశ్వనాథం, ఉష, సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఆనందయ్య ట్రస్టుకు.. ఎస్‌బిఐ సిబ్బంది విరాళం




కరోనా నివారణకు ఆయుర్వేద మందును అందజేస్తున్న ఆనందయ్య ట్రస్టుకు ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్, నెల్లూరు రీజియన్ నాయకుల ఆధ్వర్యంలో గతనెల 28న 50,116 రూపాయలను విరాళంగా అందజేశారు. కామ్రేడ్ తారక్‌నాథ్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ విరాళాన్ని అందజేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ యూనియన్ నాయకులు మూర్తి, శశికుమార్, ఎస్‌కె మనోజ్, నరహరి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళల అభ్యున్నతికే..

# సిఎం జగన్ అత్యధిక ప్రాధాన్యత

**- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న**



రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ మహిళా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. గతనెల 27న ఆయన ఇందుకూరు పేట మండలంలోని పున్నూరు గ్రామంలో నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అందజేసిన 5 లక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌కు, అనంతరం గ్రామంలో ఎంజిఎన్ఆర్ జిఇఎస్ నిధులు 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంట్‌రోడ్లకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారధ్యంలో ప్రభుత్వం గత రెండేళ్లలో మహిళల కోసం 25 సంక్షేమ పథకాలకు లక్ష కోట్ల రూపాయల దాకా వెచ్చించడం జరిగిందన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా, ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముఖ్యమంత్రి జగన్ ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, ఇందుకూరుపేట రూరల్‌బ్యాంక్ ఛైర్మెన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ గొల్లపల్లి విజయకుమార్, జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, నాయకులు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, గొల్లపల్లి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## విడవలూరు మండలంలో

విడవలూరు మండలం చౌకచర్ల, దంపూరు మిక్సిడ్ కాలనీల్లో నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నిధులతో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను ఇటీవల ఎమ్మెల్యే ప్రసన్న ప్రారంభించారు. అనంతరం చౌకచర్ల గ్రామంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన, అమూల్ డెయిరీ భవనానికి భూమిపూజ చేశారు. దండిగుంట గ్రామంలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిధులతో నెలకొల్పిన వాటర్‌ప్లాంట్‌కు ప్రారంభోత్సవం చేశారు.

## అంగన్‌వాడీ టీచరుకు సాయం



విడవలూరు మండలం చౌకచర్ల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ పుంగనూరు సుగుణమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడగా, ఆ బాధితురాలికి తమవంతు సాయంగా ఎమ్మెల్యే ప్రసన్న 50వేల రూపాయలను అందజేశారు. తన తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆమెకు ఈ సాయాన్ని అందించారు.

### బిఎంఆర్ ట్రస్టు ద్వారా..

# అల్లూరు ప్రజలకు ఆనందయ్య మందు





కరోనా నిరోధానికి ఆనందయ్య ఇస్తున్న ఆయుర్వేద మందును బిఎంఆర్ ట్రస్ట్ ద్వారా అల్లూరు మండలంలోని నార్త్‌ఆములూరు పంచాయతీలో 670 కుటుంబాల వారికి పంపిణీ చేశారు. కావలి ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మన్నెమాల మాట్లాడుతూ కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు సహకారంతో ప్రజలకు ఈ ఆయుర్వేద మందును పంపిణీ చేశామన్నారు. అల్లూరు మండలంలోని బీరంగుంట, గ్రద్దగుంట, బట్రకాగొల్లు గ్రామాల్లో కూడా ఈ మందును ప్రజలకు అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మేడా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, సామంతుల సురేష్‌రెడ్డి, నార్త్‌ఆములూరు గ్రామ సర్పంచ్ షేక్ కరిముల్లా ఖాదర్, పంచాయతి కార్యదర్శి నరేంద్ర, బిఎంఆర్ ట్రస్ట్ ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ ఇబ్బందులు తీరుస్తాం

**- డయల్ యువర్ ఎస్ఇలో ఆదిశేషయ్య**



వినియోగదారులకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఎస్పీడిసిఎల్ ఎస్ఇ కొండా ఆదిశేషయ్య చెప్పారు. గతనెల 28 ఆయన వినియోగదారుల సమస్యలను తెలుసుకునేందుకు 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమం నిర్వహించగా జిల్లావ్యాప్తంగా 13 మంది వారి సమస్యలను ఎస్ఇ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా లోఓల్టేజీ, వ్యవసాయ సర్వీసుల ఏర్పాటు, మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటు తదితర విషయాలను ఎస్ఇతో ప్రస్తావించారు. ఈ సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఇ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ కల్పన పాల్గొన్నారు.

# బ్రేక్ ఫాస్ట్ నుంచి లంచ్ టైం వరకు దీక్ష!

మొన్న మంగళవారం నాడు చంద్రబాబీయులు అద్దిరిపోయే దీక్ష చేశారు. దీనికోసం ఆయన హైదరాబాద్ నుంచి విజయవాడ తరలి వెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, అన్ని నియోజక వర్గాల్లో 'దీక్ష'లు చేయమని దేశీయులను ఆదేశించారు. అయితే, ఇది నిరవధిక దీక్షో...లేక... ఒక రోజు దీక్షో కాదు. బ్రేక్‌ఫాస్ట్‌లు అయ్యాక, కూర్చుని... లంచ్ టైం వరకు దీక్ష చేసి, భోజన వేళకు ముగించిన దీక్ష. అది కూడా రోడ్ల మీద కాదు. మంగళగిరిలో ఫైవ్‌స్టార్ కార్పొరేట్ ఆఫీస్‌ను తలదన్నే రీతిలో ఉండే టీడీపీ ఆఫీస్‌లో చేశారు. దీక్ష ముగింపుకు రాగానే... యధావిధిగా ముఖ్యమంత్రి జగన్‌ను తలా నాలుగు తిట్లు తిట్టి, ఆగ్రహాలు వ్యక్తం చేసి, 'పులివెందుల పంచాయతీ'లు ఇక్కడ కుదరవని హెచ్చరించి... భోజనాలకు లేచారు. జిల్లాల్లోనూ ఇదే తంతు.

నిజానికి, చంద్రబాబీయులు ఈ ఉత్తుత్తి దీక్ష చేయడానికి దారితీసిన కారణం మాత్రం గొప్పది. ఉదాత్తమైనది. గొప్ప మానవీయ కోణం ఉన్నది. కోవిడ్ బారినపడి, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలనేది... ఈ దీక్ష ఉద్దేశం. నిజానికి వేలాది కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోయి, జీవనాధారాలు కోల్పోయి, అయినవారిని కళ్ళముందే కోల్పోయిన ఘటనలు ఎన్నో.

దేశవ్యాప్తంగా కరోనా వల్ల మృతి చెందిన వారి కుటుంబాలకు నాలుగు లక్షలైనా పరిహారం ఇప్పించమని ఎవరో సుప్రీం కోర్టులో దావా కూడా వేశారు. మావల్ల కాదంటూ కేంద్రం చేతులెత్తేసింది. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితి అదే. అయినప్పటికీ, తెలుగుదేశం ఈ అంశాన్ని టేకప్ చేసింది. అంతవరకు చంద్రబాబునాయుడును అభినందించాల్సిందే. అయితే, ఇంతటి ఉదాత్తమైన అంశాన్ని రాజకీయం కోసం ఆయన వాడుకున్నారు. అయిదు గంటల 'దీక్ష' కోసం, హైదరాబాద్ నుంచి మందీ మార్బలంతో విజయవాడ వెళ్లడం ఎందుకు? పోస్టర్‌లు, ఛానెల్ కెమెరాల ముందు స్పీచ్‌ల బిల్డ్‌అప్‌లు ఎందుకు అనేది చూస్తే... అంశం గొప్పదే అయినా... వ్యవహారశైలిలో చిత్తశుద్ధి లోపించింది అనిపించింది.

13 జిల్లాలలోను ప్రతి మండలంలోనూ తెలుగు దేశం కార్యకర్తలు ఉన్నారు. ఆ మండలంలో ఏ గ్రామంలో ఏ కుటుంబం కరోనా బారినపడి, రోడ్ల




పాలైందో... డేటా మొత్తం సేకరించడం వారికి రెండు మూడు రోజుల పని. మొత్తం రాష్ట్రంలో ఎంతమందికి ఆర్థిక చేయూత అవసరమో తేల్చడం కేంద్ర కార్యాలయానికి చిటికెలో పని. ఆ డేటాతో ఎంత మందికి ఆర్థిక సాయం అవసరమో సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదిక ఇవ్వవచ్చు. ఆ విషయం మీడియాకు రిలీజ్ చెయ్యవచ్చు. ప్రభుత్వం స్పందించకపోతే చంద్రబాబునాయుడే స్వయంగా పూనుకుని, ఓ వంద కోట్ల రూపాయలు టీడీపీ నేతల నుంచి విరాళాలు వసూలు చేయవచ్చు. 2019 వరకు టీడీపీ మంత్రులు, ఎం.ఎల్.ఏలు, ఇతర నాయకులు రెండుచేతులా గట్టిగానే ప్రజాసేవ చేశారు కదా! తలా ఒక కోటి రూపాయలు ఇస్తే, 150 కోట్లు అవుతాయి. విదేశాలలోని టీడీపీ అభిమానులు, "తానా' ప్రముఖులు రంగంలోకి దిగితే ఓ 200 కోట్లు పోగవుతాయి. జిల్లాకు ఓ 15,20 కోట్లు కేటాయించి... అర్హులైన బాధితులకు ఆర్థిక సాయం చేయవచ్చు. జగన్ ప్రభుత్వం గూబ గుయ్ మనిపించవచ్చు.

కరోనాను మించిన విషాదం ఈ తరం చూడక పోవచ్చు. ఇంతకు మించిన సేవా కార్యక్రమం కూడా ఉండకపోవచ్చు. ఇంతటి విషాదాన్ని కూడా తెలుగు దేశం వాళ్ళు రొటీన్‌గా, క్యాజువల్‌గా, వంటికి చెమట పట్టకుండా 'దీక్ష' అంటూ కామెడీ చేయడం చాలా బాధ కలిగించింది. 'ప్రజల కోసం బతుకుతున్నాం... ఈ జీవితం ప్రజలకే అంకితం..... నేను పోరాటం చేసేది నాకోసం కాదు. మీకోసం....' అంటూ ఊదరగొట్టేవాళ్ళు కూడా ప్రజల నిస్సహాయతను రాజకీయాలకు వాడుకోవడమే పెద్ద విషాదం. స్వంత సొమ్ములు ఒక్క రూపాయి బయటకు తీసిన నాయకుడు కనిపించలేదు.

మరి ఐదేళ్ల ప్రజాసేవలో బస్తాలకు బస్తాలు పోగేశారంటూ టన్నుల కొద్దీ ఆరోపణలకు సమాధానం చెప్పిన టీడీపీయుడు ఒక్కరు కూడా కనిపించరు.


అందుకే... జగన్ ప్రభుత్వంపైనా... వ్యక్తిగతంగా జగన్ పైనా చేసే విమర్శల్లో నాటకీయత తప్ప... చిత్తశుద్ధి కనిపించదు. ధర్నాలు, ఆందోళనల్లో మీడియా యావ తప్ప చిత్తశుద్ధి... బాధితులకు న్యాయం జరగాలనే తపన కనిపించదు. చంద్రబాబు చేసే ఏ ఆలోచనలో అయినా..., పనిలో అయినా... ఒరిజినాలిటీ కనిపించాలి గానీ, కాపీ మనస్తత్వం కనిపించగూడదు. ఏ అంశం మీదనైనా ముందు ఒక న్యూస్ ఛానల్‌లో ఒక వార్త రావడం మరుసటి రోజు చంద్రబాబు దానిని పట్టుకుని జూమ్‌లో మీడియాతో మాట్టాడడం....వినీ వినీ విసుగొచ్చేస్తున్నది జనాలకు. అంతా నాటకీయత. డ్రమటైజేషన్. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా అనేక దీక్షలు చేశారు కానీ...., బ్రేక్ఫాస్ట్ నుంచి లంచ్ టైం వరకు దీక్షలు చేసిన సందర్భం లేదు. రెండు రోజులో... మూడు రోజులో... కదలకుండా కూర్చునే వారు.

వై.ఎస్. పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చారని... చంద్రబాబూ చేశారు. కానీ, వై.ఎస్. పాదయాత్రలో డ్రమటైజేషన్ లేదు. జనం పట్ల ఆత్మీయత కనిపించింది. జగన్ అప్పుడు దీక్షలు చేశారని... ఇప్పుడు చంద్రబాబు దీక్షలు చేస్తున్నారు. కానీ, జగన్ దీక్షల్లో డ్రమటైజేషన్ లేదు.

ఇలాగే 'కాలక్షేపం' చేసుకుంటూ మరో మూడేళ్లు లాగించేస్తే... జగన్ ప్రభుత్వంపై జనం వ్యతిరేకత బాగా పెరిగి... తమ రొట్టె విరిగి నేతిలో పడిపోతుందని మరో ఐదేళ్లు రెండు చేతులా ప్రజాసేవ చేసేయవచ్చు అని టీడీపీయులు భావిస్తున్నారేమో తెలియదు. కానీ, అది అంత వీజీ కాదు. అవతల ఉన్నది. జగన్. జగన్మోహనరెడ్డి. వై.ఎస్.జగన్మోహనరెడ్డి. వై.ఎస్.రాజశేఖరరెడ్డి కొడుకు.



- భోగాది వేంకట రాయుడు
bv rayudu @ YouTube



# బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టలేని ప్రభుత్వం



## - మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శ

వైకాపా ప్రభుత్వం ఈ రెండేళ్ళ పాలనలో ఏ ఒక్క నిర్ణయం కూడా సరిగా తీసుకోలేదని, పాలన అంతా అస్తవ్యస్తంగా ఉందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గతనెల 29న ఆయన చంద్రబాబునాయుడు సారధ్యంలో అమరావతిలో జరిగిన సాధన దీక్షలో పాల్గొని మాట్లాడారు. కరోనా కల్లోల సమయంలో మందులు, ఇంజెక్షన్లు దొరక్క ప్రజలు ఎంతగానో ఇబ్బందులు పడ్డారని, ఆప్తుల ప్రాణాలను కాపాడుకోవడానికి బ్లాక్‌మార్కెట్‌ను ఆశ్రయించక తప్పలేదని, చివరికి ఆనందయ్య ఉచితంగా ఇచ్చే మందును కూడా బ్లాక్‌లో కొనుక్కోవాల్సి వచ్చిందని, బ్లాక్‌మార్కెట్‌లో మందుల అమ్మకాన్ని నిరోధించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆయన దుయ్యబట్టారు. గతంలో తనపై ఒక కేసు పెట్టారని, దానిని హైకోర్టు క్వాష్ చేసిందని, మళ్లీ ఇప్పుడు మరో కేసు పెట్టారని, అయినా తానేమీ భయపడేది లేదని అన్నారు. రాష్ట్రంలో పరిస్థితులు మరీ ఘోరంగా ఉన్నాయని, వాటినుంచి బయటపడేందుకు ప్రజలు రోడ్డుమీదికి వచ్చే రోజు దగ్గరలోనే ఉందని ఆయన అన్నారు.

# కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చెయ్యాలి

## - విద్యార్థి సంఘాల నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చెయ్యాలని విద్యార్థి, యువజనసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గతనెల 29న నెల్లూరులోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను కొత్త జాబ్ క్యాలెండర్‌లో పొందుపరచాలన్నారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాబ్ క్యాలెండర్లో గ్రూప్స్, డిఎస్‌సి వగైరాలకు చోటివ్వకపోవడం విచారకరమన్నారు. ప్రతి ఏటా మెగా డిఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు క్యాలెండర్‌లో డిఎస్‌సికే చోటు లేకుండా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎం.వి రమణ, శ్రీనివాసులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అవినీతి, దౌర్జన్యాలే వైకాపా పాలన

## - బిజెపి నేత భరత్‌కుమార్



వైకాపా రెండేళ్ల పాలన అంతా అవినీతి, దౌర్జన్యాలతోనే సాగిందని, వీటిని ఎవరైనా ప్రశ్నిస్తే అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులు పెడుతున్నారని బిజెపి జిల్లా నేత భరత్‌కుమార్ అన్నారు. కావలి నియోజక వర్గంలో అధికారపార్టీ నాయకులు, వారి అనుచరులు అక్రమంగా మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ గతనెల 29న బిజెపి ఆధ్వర్యంలో కావలి ఆర్డీఓ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో గ్రావెల్, మట్టి, ఇసుక రేయింబవళ్ళు తరలించుకుపోతున్నా అధికారులు కళ్ళకు గంతలు కట్టుకుని ఉన్నారని, పోలీస్, రెవెన్యూ వ్యవస్థలు పూర్తిగా అధికారపార్టీకి లోబడిపోయి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మురళీకృష్ణనాయుడు, బిజెపి పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు పులిచెర్ల నారాయణరెడ్డి, రంగారెడ్డి, బాలమురళి, కిరణ్‌కుమార్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# కరోనా మృతుల కుటుంబాలకు 10 లక్షలివ్వాలి



రాష్ట్రంలో కరోనా బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో గతనెల 29న నిర్వహించిన సాధన దీక్షలో నాయకులు ఆరోపించారు. టిడిపి నాయకులు అబ్దుల్ అజీజ్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు నగర టిడిపి ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెడ్ శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య తదితరులు మాట్లాడుతూ కరోనా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే 10 లక్షల వంతున చెల్లించాలని, ఆక్సిజన్ అందక మృతిచెందిన వారి కుటుంబాలకు పాతిక లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా మూలంగా ఉపాధి కోల్పోయిన ప్రతి కుటుంబానికి 10వేల వంతున సాయం చేయాలన్నారు. కరోనా బాధితులకు న్యాయం జరిగేదాకా టిడిపి పోరాడుతుందని అన్నారు. టిడిపి నాయకులు బొమ్మి సురేంద్ర, పనబాక భూలక్ష్మి, మల్లి నిర్మల, కాకర్ల తిరుమలనాయుడు, పెంచల నాయుడు, ఒట్టూరు సంపత్‌రాజు, సాబీర్‌ఖాన్, జలదంకి సుధాకర్, కొమరి విజయ, పొత్తూరు శైలజ, అమృల్లా తదితరులు పాల్గొన్నారు.

# రచయిత ములుముడి ప్రభాకర్‌రావు కన్నుమూత




నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత, డిసిసిబి మాజీ అసిస్టెంట్ మేనేజర్ ములుమూడి ప్రభాకర్‌రావు (68) గతనెల 26న గుండె పోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంచి రచయితగా, స్నేహపాత్రునిగా పేరొందడమే కాక, నగరంలోని సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ సభ్యునిగా కూడా ఆయన విశేష సేవలందించారు. ప్రభాకర్‌రావు మృతి రచనా రంగానికి తీరని లోటని అంటూ ఆయన మృతికి సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సర్వేపల్లి రామమూర్తి, శివకుమార్ తదితరులు విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# కవి దూబగుంట.. ఇక లేరు



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, విశ్రాంత తహశీల్దార్ దూబగుంట వెంకటేశ్వరరావు గతనెల 29న అనారోగ్యంతో ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. చాలాకాలం ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో పనిచేసి, పదోన్నతి పొంది దొరవారిసత్రం తహశీల్దార్‌గా పనిచేస్తూ రిటైరయ్యారు. ప్రత్యేకించి ఆయనకు సాహిత్యమంటే ఎంతో ఇష్టం. నగరంలో జరిగిన పలు కవిసమ్మేళనాల్లో కూడా ఆయన పాల్గొన్నారు. ఆయన మృతికి సహచర కవులు, సహోద్యోగులు విచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



### నిరాడంబరంగా..

## నర్రవాడ వెంగమాంబ బ్రహ్మోత్సవాలు



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవాలయంలో గత నెల 27న బ్రహ్మోత్సవాలు నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో కొలువైవున్న వెంగమాంబాదేవి దంపతులకు ఆలయ అర్చకులు ఏకాంతంగా పూజలు, సేవలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వెంగమాంబ దంపతుల విగ్రహమూర్తులను శోభాయమానంగా అలంకరించి పూజలుచేశారు. కరోనా నేపథ్యంలో కోవిడ్ నిబంధనలను అనుసరించి ఆలయంలో కార్యక్రమాలు చేస్తున్నారు. ఆలయ ఛైర్మెన్ పచ్చువ కరుణాకర్‌బాబు, ఇ.ఓ ఆర్.వెంకటేశ్వర్లు, ధర్మకర్తల ఆధ్వర్యంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి.

## మితిమీరిన వేగం.. తీసేసింది ప్రాణం

### --- రోడ్డుప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం ---



బైక్ ఎక్కితే చాలు.. ఎక్కడలేని వేగంతో నడుపుతూ ఎంతోమంది ప్రాణాలమీదికి తెచ్చుకుంటూనే ఉన్నారు. అతివేగం ప్రమాదకరమని తెలిసినా, ఎవరెంతగా చెప్పినా వినిపించుకోకుండా బైక్ ఎక్కంగానే పూనకం వచ్చినట్లు మితిమీరిన వేగంతో వెళ్తూ చివరికి ప్రాణాలనే కోల్పోతున్నారు. గతనెల 27న కూడా ఇలాంటి దుర్ఘటనే జరిగింది. బీటెక్ చదువుకునే విద్యార్థి మితిమీరిన వేగంతో బైక్ నడుపుతూ ప్రమాదానికి గురై మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఇమ్రాన్ (22) ఆదివారం రాత్రి బైక్‌పై నెల్లూరు నుంచి బుచ్చికి బయలుదేరాడు. మితిమీరిన వేగంతో బైక్ నడుపుతూ ప్రశాంతినగర్ దగ్గరకి వచ్చేసరికి ముందు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెలిసిన వెంటనే బుచ్చి నార్త్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాములునాయక్ ప్రమాదస్థలాన్ని సందర్శించి, ఇమ్రాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిజిహెచ్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విజ్ఞాన నిధిగా.. జాతీయ విద్యా విధానం

### - శ్రీసిటీ ఐఐఐటి కళాశాల స్నాతకోత్సవంలో కేంద్రమంత్రి సంజయ్ ధోత్రే




విద్యార్థులకు విజ్ఞాన నిధిని అందించే ధ్యేయతోనే జాతీయ విద్యా విధానం –2020 రూపొందించబడిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి సంజయ్ ధోత్రే అన్నారు. గతనెల 30న శ్రీసిటీలోని ఇండియన్ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటి) కళాశాల స్నాతకోత్సవం జరిగింది. కేంద్రమంత్రి సంజయ్ ధోత్రే ముఖ్యఅతిథిగా వర్చువల్‌మోడ్‌లో పాల్గొనగా, ఐఐఐటి శ్రీసిటీ గవర్నర్స్ బోర్డు ఛైర్మెన్ ఎం.బాలసుబ్రహ్మణ్యం, సభ్యుబు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.కన్నాబిరాన్ తదితరులు ఈ కార్యక్రమంలో నేరుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న డిజిటల్ విప్లవాన్ని ప్రశంసించారు. డిజిటల్ మార్చ్‌కు నాయకత్వం వహించడం ద్వారా తమవంతు పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల పతకాల విజేతలు ఎం.సునీల్‌కుమార్‌శెట్టి, ఎన్.వైష్ణవి, వి.రాజ్యలక్ష్మిలకు స్నాతకోత్సవ అతిధులు ఎం.బాలసుబ్రహ్మణ్యం, రవీంద్ర సన్నారెడ్డి, జి.కన్నాబిరాన్‌ల నుంచి పతకాలు, డిగ్రీ పట్టాలు పొందారు. 164 మంది కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థులు, 97 మంది ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజ నీరింగ్ విద్యార్థులతో సహా 261 మంది విద్యార్థులు డిగ్రీలను పొందారు.

### కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అధ్యక్షత్వంలో

## సెజ్ సమావేశంలో శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి



కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ అధ్యక్షతన గతనెల 28న జరిగిన సెజ్ (స్పెషల్ ఎకనామిక్ జోన్) పాలసీ సమీక్షా సమావేశంలో సెజ్ పాలసీ కమిటీ సభ్యులు, ప్రముఖ సెజ్ నిర్వాహకులుగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆన్‌లైన్‌లో జరిగిన ఈ సమావేశంలో బాబా కల్యాణి నేతృత్వంలోని సెజ్ పాలసీ కమిటీ సభ్యులు, దేశంలోని ప్రముఖ సెజ్ నిర్వాహకుల నుంచి సెజ్ విధి విధానాలకు సంబంధించిన సంస్కరణలపై కేంద్రమంత్రి సలహాలు కోరారు. ఎక్కువ ఉపాధి అవకాశం ఉన్న తయారీ పారిశ్రామిక రంగానికి ప్రభుత్వ సహాయ సహకారాల ఆవశ్యకతను చెప్తూ, దేశంలోని సెజ్‌లలో 87 శాతం ఖాళీగా ఉన్నందువల్ల, సెజ్‌లలో పెట్టుబడి పెట్టి పరిశ్రమలకు ప్రభుత్వపరంగా ఇచ్చే ప్రోత్సాహకాలను మరింత పెంచాలని రవీంద్ర సన్నారెడ్డి సూచించారు. ఎగుమతి స్థాయిలను పెంచడానికి, ఆర్థికాభివృద్ధిని సులభతరం చేయడానికి అవసరమైన కీలక సంస్కరణలపై ఈ సమావేశంలో చర్చించారు.




# గూడూరు డివిజన్ వార్తలు

## గూడూరు పట్టణ
## తొలి మహిళా సిఐగా నాగేశ్వరమ్మ



గూడూరు టౌన్ సి.ఐగా నాగేశ్వరమ్మను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు తొలి మహిళా సిఐ నాగేశ్వరమ్మే కావడం విశేషం! నాగేశ్వరమ్మ గతంలో నెల్లూరు 4వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సిఐగా పని చేశారు.



కరోనా బాధితుల డిమాండ్‌ల అమలు కోసం సాధన దీక్ష చేపట్టిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుకు సంఘీభావంగా గూడూరులో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జూన్ 29వ తేదీన సాధన దీక్ష చేపట్టిన మాజీ శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

## చిరమన సేవలు ప్రశంసనీయం
### - ఎం.ఇ.ఓ నందకుమార్



37 ఏళ్ళుగా విద్యార్థిని, విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చి దిద్దిన చిరమన నాగేంద్రకుమార్ సేవలు ప్రశంసనీయమని మండల విద్యాశాఖాధికారి నందకుమార్ కొనియాడారు. జూన్ 30వ తేదీ చాగణం గ్రామంలోని ఎంపిపిజిడబ్ల్యూ స్కూల్‌లో తన పదవి విరమణ చేసిన నాగేంద్రకుమార్ ఉపాధ్యాయవృత్తితో పాటు సాంస్కృతిక రంగంలో కూడా ఎక్కువ శ్రద్ధ చూపేవారని, మంచి కళాకారుడు అని అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నో ప్రశంసాపత్రాలు అందుకున్నారని అన్నారు. పదవి విరమణ చేసిన చిరమన నాగేంద్రకుమార్‌ను ఎం.ఇ.ఓ నందకుమార్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిరమన కుటుంబసభ్యులు శ్రావణ్‌కుమార్, లక్ష్మి, మధుమతి, ఉదయకుమార్, హేమలత, రుతిక, మురళి, నట్రాజ్‌కుమార్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తాళమ్మకు ప్రత్యేక పూజలు



గూడూరు పట్టణ ప్రజల ఆరాధ్యదైవం ఆది పరాశక్తి స్వరూపిణిగా పూజలందుకునే శ్రీశ్రీశ్రీ తాళమ్మ వారికి ఆలయ అర్చకులు ఇటీవల ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి అర్చకులు అభిషేకాలు, అష్టోత్తరనామాలు, కుంకుమార్చనలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరోనా నివారణకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని ఆలయంలో పొంగళ్ళు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. కరోనా కారణంగా ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తుల కోసం అన్ని జాగ్రత్తలను పాటిస్తూ ఏ ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపట్టారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.



చిత్తూరుజిల్లా పరిధిలోని ఎస్సీ ఎస్టీల సమస్యలపై ఇటీవల ఏపి ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్యకు నివేదిక సమర్పిస్తున్న ఏపి ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ చిత్తూరుజిల్లా శాఖ అధ్యక్షులు తనిగవేలు, ప్రధానకార్యదర్శి నాగరాజు.

## నిరుద్యోగులకు
## ఉద్యోగాలు కల్పించాలి



ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, ఖాళీలను భర్తీ చేయాలని బియస్‌పి నాయకులు భాస్కర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గత నెల 28వ తేదీ గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏడాదికి 50వేల ఉద్యోగాల చొప్పున కేటాయించాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. అదేవిధంగా కోట మండలం, కొత్తపట్నం ప్రాంతంలో 40ఏళ్ల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన సిజెయఫ్ఎస్ భూములకు సంబంధించి హక్కుదారులైన వ్యక్తుల పేర్లు ప్రకటించాలని తద్వారా వారసులకు భూమి సంక్రమించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా కార్యదర్శి మీజూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

40 లాయర్ YEARS

అన్యాయాలను ఎదిరించే కలం
పాఠకుల ఆశీస్సులే బలం
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

వి.ప్రభాకర్‌రెడ్డి
మేనేజింగ్ పార్ట్‌నర్

వి.ఎస్.చేతన్‌రెడ్డి
మేనేజింగ్ పార్ట్‌నర్

PR Infra
Engineers & Contractors
1st Lane, Lecturers Colony, Magunta Layout, Nellore.
E-mail: prinfravpr@gmail.com, Cell: 91000 90002.

# మహా దివ్యధామం.. కొత్తూరు శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయం





**రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ఎంతో అపురూపం.. అద్వితీయమైన శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయం నెల్లూరుజిల్లాలోని కొత్తూరు గ్రామంలో ఉంది. ధార్మికసేవా తత్పరులు, మహాదాతలైన కలికి కోదండరామిరెడ్డి-శ్రీలత దంపతులు అచంచల భక్తితో కనీవినీ ఎరుగని విధంగా కోట్లాది రూపాయలు వెచ్చించి ఈ ఆలయాన్ని నిర్మించడం విశేషం. ఒక చిన్న గ్రామంలో ఇంతటి గొప్ప దేవాలయం ఉండడం ఒక విశేషమైతే, ఆలయం లోపల ధ్యానముద్రలో ఉన్న శ్రీ యోగాంజనేయస్వామిని చూస్తే భక్తుల మనసులు పులకించిపోతాయి. భక్తాభీష్టప్రదాయకుడైన శ్రీ యోగాంజనేయస్వామిని భక్తితో కొలుచుకునేవారి కోర్కెలు ఇట్టే సఫలీకృతం కావడమే కాక, స్వామివారిని దర్శించుకున్నవారి జన్మ ధన్యమవుతుంది కూడా. ఇంతటి అద్భుతమైన ఆలయం నిర్మాణం వెనుక ఆసక్తికరమైన చరిత్ర కూడా ఉంది.**

మన దేవాలయాలు (54)


జిల్లాలోని ఇందుకూరుపేట మండలంలో ఉన్న కొత్తూరు గ్రామం ఒక చిన్న పల్లెటూరు. సముద్రతీర ప్రాంత గ్రామం కనుక ఎప్పుడూ చల్లని గాలి, సుప్రశాంత వాతావరణం ఉన్న పల్లె ఇది. కొబ్బరి తోటలతో ఈ ఊరంతా మరో కోనసీమ అన్నట్లుగా ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అందులోనూ ఈ గ్రామం ప్రముఖ పారిశ్రామికవేత్త, నెల్లూరుజిల్లా వాసి, బెంగుళూరు నివాసి కలికి కోదండ రామిరెడ్డి సతీమణి శ్రీమతి శ్రీలతకి పుట్టినిల్లు. ఈ నేపథ్యంలో నిరంతరం భగవంతుని సేవలో తరించే కలికి దంపతుల మదిలో ఇక్కడ శ్రీ సాయినాధునికి, శ్రీ ఆంజనేయస్వామికి ఆలయాలు నిర్మించాలనే సంకల్పం కలిగింది. అది భగవత్సంకల్పం కనుక అచిరకాలంలోనే వారి కృషి ఫలించి కొత్తూరులో ఆ రెండు దివ్యారామాలు వెలిశాయి. అందులోనూ శ్రీరామచంద్రుని తన హృదయపీఠంలో నిలుపుకున్న శ్రీ ఆంజనేయస్వామి దివ్యధామంగా ఈ ఆలయం ప్రఖ్యాతిగాంచింది. శ్రీరాముని సేవలో తరించిన రామభక్త హనుమాన్ సేవలో తరించి తమ జన్మను సార్థకం చేసుకోవాలనే భక్తిశ్రద్ధలతో శ్రీ యోగాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి వారు పడిన తపన అంతా ఇంతా కాదు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి కోదండరామిరెడ్డి ఈ ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. 2013లో ఆలయ నిర్మాణం పూర్తై, స్వామివారి విగ్రహప్రతిష్ఠ కూడా ఎంతో వైభవంగా జరిగింది. తొలి వార్షిక బ్రహ్మోత్సవాలు 2014 ఏప్రిల్ 21 నుంచి 25 దాకా 5రోజుల పాటు నేత్రపర్వంగా జరిగాయి.

## ధ్యానముద్రలో.. శ్రీ యోగాంజనేయస్వామి


కోట్లాది రూపాయలు వెచ్చించి దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన శిల్పులను రప్పించి అద్వితీయమైన రీతిలో ఆలయం నిర్మించారు. సాక్షాత్తూ ఆ పవనసుతుడే ఇక్కడికి వచ్చి ధ్యానం చేసుకుంటున్నాడా.. అన్నట్లుగా ఎంతో అద్భుతమైన శిల్పకళతో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. దివ్య తేజస్సుతో అలరారే స్వామివారి విగ్రహ మూర్తిని చూసేందుకు రెండుకళ్ళూ చాలవంటే అతిశయోక్తి కాదు. ఇక్కడే మరో విశిష్టత కూడా ఉంది. స్వామివారిని దూరం నుంచి చూస్తే కళ్ళు మూసుకుని ధ్యానం చేసుకుంటున్నట్లుగా ఉంటుంది. మనం దగ్గరకు వెళ్ళే కొద్దీ స్వామివారు కొద్దికొద్దిగా కళ్ళు తెరచి మనల్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. జీవకళ ఉట్టిపడేలా.. ఎంతో ఆశ్చర్యం గొలిపే ఇంతటి శిల్పకళా ప్రతిభ ఈ కాలంలో ఎంతైనా అపురూపమే. అంతేకాదు, స్వామివారి శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించిన మండపంలో రామాయణంలోని అరుదైన ఘట్టాలను కూడా కళ్ళముందు నిలిపేవిధంగా రూపొందించిన చిత్రాలు భక్తులను ఇట్టే ఆకట్టుకుంటాయి. ఇంతటి అపురూపమైన ఆలయాన్ని దర్శించుకోవడం భక్తులకు ఓ మహద్భాగ్యం. ఆ పుణ్యమంతా కలికి కోదండరామిరెడ్డి దంపతులదే. శ్రీ యోగాంజనేయస్వామికి, ఈ ప్రాంతంలోనే శ్రీ షిరిడి సాయినాధునికి కూడా ఎంతో ఘనమైన ఆలయాలు నిర్మించి భక్తులకు స్వామివార్ల దర్శన భాగ్యం కల్పిస్తున్న కలికి దంపతుల ఆధ్యాత్మిక సేవలు జిల్లా ఆధ్యాత్మిక చరిత్రలో శాశ్వతంగా నిలచిపోయేవేనని చెప్పవచ్చు.

## అరుదైన ఏకశిలా విగ్రహమూర్తి

కొత్తూరు దేవాలయంలో ధ్యాన ముద్రలో ఉన్న శ్రీ యోగాంజనేయస్వామి ఎంతో అరుదైన ఏకశిలా విగ్రహమూర్తిగా భక్తులకు దర్శనమిస్తాడు. ఇందుకోసం ప్రఖ్యాత శిల్పులు దాదాపు 60 టన్నుల బరువైన పాలరాయి శిలను 40 టన్నులకు కుదించి, ఆ శిలను 23 టన్నులు వచ్చేలా 12 అడుగుల ఎత్తులో, 8 అడుగుల వెడల్పుతో, 6 అడుగుల లోతులో ఎంతో అత్యద్భుతమైన రీతిలో శ్రీ యోగాంజనేయస్వామి విగ్రహమూర్తిని రూపొందించారు. సూర్యోదయ, చంద్రోదయ వేళల్లో ఆ కిరణాలు శ్రీస్వామివారి విగ్రహంపై ప్రసరించి మరింతగా ప్రకాశించేలా చుట్టూ గోళాకారంతో అద్దాలు నిర్మించారు. భారతదేశంలోనే ఇంతటి అరుదైన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం బహుశా మరెక్కడా ఉండకపోవచ్చు కూడా. ఢిల్లీలోని అక్షరథామ్‌ని తలపించేంత శిల్పకళా వైభవాన్ని మనం ఇక్కడ చూడవచ్చు. దేశంలోనే ప్రఖ్యాతమైన పుణ్యక్షేత్రాల్లో కొలువైవున్న దేవతా మూర్తుల విగ్రహాలు 60 దాకా ఉన్నాయి. భక్తుల బాధలు, భయాలు బాపి, శుభాలు చేకూర్చే శ్రీ యోగాంజనేయస్వామి దివ్య దర్శనం కోసం వచ్చే భక్తులతో ఆలయం నిత్యం కళకళలాడుతోంది.

కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక



నాకు అత్యంత ఆప్తులు, సన్నిహితులు, హితులు
కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు స్థాపించిన 'లాయర్' వారపత్రిక
నెల్లూరుజిల్లా వార్తల వేదికగా, రాజకీయ విశ్లేషణల వీచికగా
నాలుగు దశాబ్దాలు విజయవంతంగా పూర్తి చేసుకుని,
విజయోత్సాహంతో స్వర్ణోత్సవం వైపు దూసుకు వెళుతున్న శుభ సమయంలో
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

రావి మోహన్‌చౌదరి
కర్ణాటక టి.డి.పి కో-ఆర్డినేటర్




# బటన్ నొక్కితే చాలు.. భద్రత

**రాష్ట్రంలోని ప్రతి మహిళ సురక్షితంగా ఉండాలనే సంకల్పంతో, ఒకవేళ వారు ప్రమాదాల్లో పడితే వారిని వెంటనే రక్షించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'దిశ' మొబైల్ యాప్ ఒక అద్భుతమైన ఆవిష్కరణగా అందరి ప్రశంసలు అందుకుంటోంది. జాతీయస్థాయిలో కూడా ఇది మంచి గుర్తింపును తెచ్చుకుంది. రాష్ట్రంలోని మహిళలందరికీ త్వరలోనే ఈ యాప్ అందుబాటులోకి వచ్చేలా సిఎం జగన్ చర్యలు తీసుకోవడం మహిళాలోకంలో సర్వత్రా సంతోషం కలిగిస్తోంది.**

- **ప్రతి మహిళకు రక్షణ కోసం..'దిశ' యాప్**
- **అద్భుతమైన ఆవిష్కరణగా జాతీయస్థాయి గుర్తింపు**



### ఆపదలో ఉన్నవారికి రక్షణ :

యువతులు, మహిళలు ఆపదలో ఉన్నామని భావించినప్పుడు 'దిశ యాప్' ద్వారా పోలీసులతో పాటు, అయిదుగురు కుటుంబసభ్యులు, స్నేహితులకు సమాచారం ఇచ్చే వెసులుబాటు కూడా ఉంది. అంతేకాదు, ప్రయాణ సమయాల్లో రక్షణకు, మార్గం చూపేందుకు 'ట్రాక్ మై ట్రావెల్' ఆప్షన్ కూడా ఇందులో ఉంది. తాము చేరాల్సిన గమ్యస్థానాన్ని అందులో నమోదు చేస్తే అనుక్షణం ట్రాకింగ్ చేస్తూ, ప్రయాణిస్తున్న వాహనం ఒకవేళ దారి తప్పితే వెంటనే ఆ సమాచారాన్ని దిశ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, వారి బంధుమిత్రులకు చేరవేసి రక్షణ కలిగించే వెసులుబాటు ఉంది.

మహిళలెవరైనా ఆపదలో చిక్కుకుంటే.. 'దిశ యాప్' ద్వారా సంకేతం ఇస్తే చాలు..నిమిషాల్లో పోలీసులు వచ్చి వారిని రక్షిస్తారు. అన్నివిధాలా ఎంతో భద్రత కల్పించే విధంగా దిశ యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఒక్క మాటలో చెప్పాలంటే, మొబైల్ ఫోన్‌లో 'దిశ' యాప్ ఉంటే చాలు.. ఆ మహిళలకి ఒక అన్నయ్య తోడు ఉన్నట్లే. మహిళలు తమ ఆండ్రాయిడ్, ఐఓఎస్ మొబైల్ ఫోన్లలో గూగుల్ ప్లే స్టోర్, లేదా యాపిల్ యాప్ స్టోర్‌కు వెళ్ళి 'దిశ యాప్'ను డౌన్ లోడు చేసుకుంటే చాలు..మన భద్రతకు మనం చర్యలు తీసుకున్నట్లే.

క్యుఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా కూడా 'దిశ యాప్' డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

'దిశ యాప్'ను డౌన్‌లోడ్ చేసుకునే విధానం, అది ఉపయోగపడే తీరు తదితర వివరాలు ఇలా ఉన్నాయి.

## యాప్‌ను ఇలా డౌన్‌లోడ్ చేసుకోవాలి

మహిళలు ఎప్పుడైన ప్రమాదాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితుల్లో వెంటనే తమ చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న 'దిశ' యాప్‌ను ఉపయోగించుకోవాలి. ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం చాలా సులభం కూడా. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నెంబరు ఎంటర్‌చేయగానే ఫోన్‌కు ఓటిపి నెంబర్ వస్తుంది. ఆ ఓటిపి నెంబర్‌ను యాప్‌లో నమోదు చేసి పేరు, అడ్రస్, ప్రత్యామ్నాయ మొబైల్ నెంబర్, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన కాంటాక్ట్ నెంబర్లు వగైరా వివరాలను నమోదు చేయగానే యాప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆపదలో ఉన్నామని భావించిన సమయంలో వెంటనే దిశ యాప్‌లో ఉన్న అత్యవసర సహాయం 'ఎస్ఓఎస్' బటన్ నొక్కితే చాలు..వారి ఫోన్ నెంబరు, చిరునామా, వారు ఉన్న ప్రాంతం అన్నీ వారి వాయిస్‌తోపాటు పది సెకన్ల వీడియో కూడా రికార్డ్ చేసి వెంటనే దిశ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు పంపేలా 'దిశ యాప్'కు రూపకల్పన చేయడం ఎంతో విశేషం. మహిళల నుంచి అలర్ట్ రాగానే కమాండ్ కంట్రోల్ సిబ్బంది అప్రమత్తమై దగ్గరలో ఉండే పోలీస్‌స్టేషన్‌కు సమాచారాన్ని అందిస్తారు. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని వారికి రక్షణ కల్పిస్తారు.

## మరీ విపత్కర పరిస్థితుల్లో

ఒక వేళ మరీ విపత్కర పరిస్థితులు ఎదురైతే 'దిశ యాప్'ను ఓపెన్ చేసేందుకు తగు సమయం లేకపోతే, ఫోన్‌ను గట్టిగా అటూ ఇటూ ఊపితే చాలు, ఈ యాప్ ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఆపద సందేశం చేరేలా ఏర్పాటుచేశారు. ఆ సందేశం రాగానే అధికారులు అప్రమత్తమై ఆ మొబైల్‌కు కాల్ చేస్తారు. ఎవరూ స్పందించకపోతే వెంటనే పోలీసు వాహనాల్లో అమర్చిన మొబైల్ డేటా టెర్మినల్ సహాయంతో జిపిఎస్ ట్రాకింగ్ ద్వారా బాధితులు ఉన్న ప్రాంతానికి పోలీసులు నేరుగా చేరుకుని వారికి రక్షణ కల్పిస్తారు. పోలీసు ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిధిలో 'పుష్ బటన్' ఆప్షన్ ఉంటుంది. దీని ద్వారా పోలీసులు యాప్ వినియోగదారులకు ఏకకాలంలో సూచనలు, సలహాలు అందించి, వారిని జరగబోయే ప్రమాదాల గురించి తెలియజెప్పి అప్రమత్తం చేసే ఏర్పాటు కూడా ఉండడం విశేషం.

ఈ యాప్‌ను గత నెల 30న సిఎం వైయస్ జగన్ విజయవాడలోని గొల్లపూడిలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ మహిళల భద్రతకు ఈ యాప్ రూపొందించడం జరిగిందని, ఈ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలన్నారు. కనీసం కోటిమందికి పైగా సెల్‌ఫోన్‌లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలని, ప్రతి అక్క, ప్రతి చెల్లెమ్మ మొబైల్ ఫోన్‌లో 'దిశ' యాప్ ఉండాలని అంటూ ఈ యాప్ ఉంటే అన్నయ్య తోడు ఉన్నట్లేనని సిఎం చెప్పారు.

ఏదేమైనా ఈ దిశ యాప్ మహిళల భద్రతకు అన్ని విధాలా అండగా.. శ్రీరామ రక్షగా ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.





# Success + Success = Triumph in IIT & Medical entrance

**Ratnam Jr. College and Amaravati IIT-JEE Academy & Doctors Medical Academy join hands to empower success in NEET and JEE.**

Now the strength of a legendary coaching center and the teaching of a legend, make coaching for NEET and JEE strong as they come together. The students aspiring for JEE and NEET coaching can now make their learning more powerful through planning, analysis, critical evaluation and supervision of senior and successful IIT and Medical coaching faculty in the country. This focused and result-oriented approach by teachers and a combined efforts of students is bound to script a new success story in the state.



**K.V. Ratnam**
*Founder Chairman,*
Ratnam Medical Academy & Jr. Colleges, Nellore

Fondly known as "Ratnam Sir", his undisputed 46 years of experience in grooming aspirants into successful Doctors and Engineers is well-known in the state. His students are now across the state, country, abroad and are testimonials for 'Ratnam Sir' effort in grooming success.

## The proof to undisputed success of Amaravati IIT-JEE Academy and Doctors' Medical Academy is the students who've joined top Engineering and Medical institutions in the country.

Every top Institution in India has a student of Ratnam Jr. Colleges, Amaravati IIT-JEE Academy & Doctors' Medical Academy who successfully cracked national-level Medical and Engineering competitions to realize their dream.

**109** Talented Alumni of Ratnam Medical Academy and Doctors' Medical Academy have Entered Top Medical Institutions in the Country.

**Doctors' Medical Academy Successful Club in Top Medical Institutions in the Country.**

- AIIMS, Raipur • AIIMS, Bhopal • Osmania Medical College, Hyderabad
- Kurnool Medical College, Kurnool • Sri Venkateswara Medical College, Tirupati
- Sri Padmavathi Medical College For Women, Tirupati
- ACSR Govt. Medical College, Nellore • Government Medical College, Anantapur
- Guntur Medical College, Guntur • Narayana Medical College, Nellore
- Apollo Institute of Medical Sciences, Chittoor
- Rajiv Gandhi Institute of Medical Sciences, Kadapa
- Viswabharathi Medical College, Kurnool • PES Medical College, Kuppam
- Fathima Medical College, Kadapa • Siddartha Medical College, Vijayawada
- Oxford Medical College, Bengaluru • Sri Sathya Sai Medical College, Chennai
- Sri Siddhartha Institute of Medical Sciences, Bengaluru
- Kamineni Academy of Medical Sciences, Hyderabad • Govt. Dental College, Vijayawada
- Rajiv Gandhi Institute of Dental Sciences, Kadapa • Govt. Dental College, Hyderabad
- CKS Teja Dental College, Renigunta • GPR Dental College, Kurnool

**150** Talented Alumni of Amaravati IIT-JEE Academy have Joined Top Engineering Institutions in the Country

**Our Alumni Club who joined Top Engineering Institutions in the State and Country**

| | | | |
|---|---|---|---|
| IITs | 8 | NITs | 16 |
| IIITs | 1 | ANNA University | 1 |
| PSG Coimbatore | 1 | VIT | 50 |
| SSN | 4 | SASTRA University | 14 |
| AMRITA University | 16 | SRM University | 12 |
| SVU Campus | 9 | GITAM University | 18 |

**400** more students have joined other top engineering institutions in the country



**B.V. Krishna Reddy**
*Founder Chairman*
*Amaravati IIT-JEE Academy & Doctors' Medical Academy*

**Admissions Open | Integrated JEE/NEET Day and Residential Programme.**

**Intermediate + Bi.P.C. + NEET (AIIMS & JIPMER) | Intermediate + M.P.C. + JEE (Main + Adv.)**

RATNAM MEDICAL ACADEMY NELLORE

AMARAVATI IIT-JEE ACADEMY
Integrated JEE (Main & Advanced) Course

DOCTORS' MEDICAL ACADEMY
Integrated NEET and AIIMS Course

**Ratnam Medical Academy:** Nellore: 80083 04747, 96525 88880, 99667 87340, 91009 04937.

**Amaravati IIT-JEE Academy:** VIJAYAWADA: 98480 97799. TIRUPATI: 95051 58058. NELLORE: 96525 88880.

**Doctors' Medical Academy:** VIJAYAWADA: 98485 49321. TIRUPATI: 95051 58058. NELLORE: 96525 88880, 80083 04747.

Corporate Office: A.I.R. By-pass Road, Tirupati. M: 95051 58058, 94404 24012, 98490 46255.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com